## హాస్టల్ రూములో యాంటీ సూసైడ్ ఫ్యాన్లు



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 24 అక్టోబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 289 | పేజీలు: 8+4 | వెల రూ.5


## అవ్వ ఐడియా అదుర్స్!



2


GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


### జ్ఞానేశ్ అభిశంసనకు నోటీసు ఇస్తే

# పరిశీలిస్త

**లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా**



**ఢిల్లీ, అక్టోబర్ 23:** సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పై ప్రతిపక్షాలు కొత్తగా అభిశంసన తీర్మానం ప్రవేశపెడితే దానిని సభా నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి అభిశంసనకు పాటించే ప్రక్రియనే దీనికీ అనుసరించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలు వెల్లడించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.

'ఎన్సీపీఐలో చేరిన తమ పార్టీ ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ తృణమూల్ దాఖలుచేసిన అనర్హత పిటిషన్లపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు కోసం ఈ నెలాఖరులో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయబోతున్నట్లు వచ్చిన వార్తల గురించి బదులిస్తూ.. దానిపై ఇప్పుడే ఏమీ చెప్పలేమన్నారు. వర్షాకాల సమావేశాలను ప్రొరోగ్ చేయడం తన చేతుల్లో లేదని స్పీకర్ స్పష్టం చేశారు.

# లెక్క తేలింది

# సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్చలు

### రెబల్స్ సమస్యను పరిష్కరించేలా చూడాలి

### సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయం



FILE PHOTO

**విజయవాడ మనంప్రత్యేక ప్రతినిధి:** సీఎం చంద్రబాబు నాయుడుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుక్రవారం సమావేశమయ్యారు. సీఎం నివాసానికి కాన్వాయ్తో వచ్చిన పవన్.. ఆయనతో సుమారు అరగంట పాటు భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలు, జిల్లా పరిషత్ స్థానాల సర్దుబాటు వంటి అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించిన సీట్ల సర్దుబాటు ఫార్ములా తరహాలోనే జిల్లా పరిషత్ ఎన్నికల్లోనూ టీడీపీ, జనసేన మధ్య స్థానాల కేటాయింపు ఉండే అంశంపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కూటమిలోని మూడు పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై నేతలు సమీక్షించారు. ముఖ్యంగా, పలుచోట్ల రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటంతో వారిని బుజ్జగించి, నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా పోటీ నుంచి తప్పించేలా చూడాలని నిర్ణయించారు.మిత్రపక్షాలు పూర్తి సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎక్కడా ఎలాంటి విభేదాలకు తావివ్వకూడదని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేసుకున్నారు.

చిత్తూరు, తిరుపతి, కాకినాడ, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొన్ని స్థానాలను జనసేన ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ జిల్లాల్లో పార్టీకి అనుకూలంగా ఉన్న స్థానాలను గుర్తించి సీట్ల సర్దుబాటు చేసుకునే అంశంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చర్చించినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సమయంలో కొన్ని ప్రాంతాల్లో టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ పరిణామాలపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం.

క్షేత్రస్థాయిలో ఇరు పార్టీల మధ్య విభేదాలు తలెత్తకుండా, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవడం గురించి చర్చించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో కూటమి ఐక్యతను కొనసాగిస్తూ, పరస్పర సహకారంతో ముందుకు వెళ్లేలా సంకేతాలు ఇచ్చే అంశంపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం.



# నేడు ఢిల్లీకి చంద్రబాబు



**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇది కేవలం ఒక్కరోజు పర్యటన మాత్రమే కావడం గమనార్హం. మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి, అక్కడ అధికారిక కార్యక్రమాలు ముగించుకుని అదే రోజు అర్ధరాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని పలువురు ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించే వీలుంది. అలాగే ఢిల్లీలోని జన్పథ్లో జరగనున్న ఒక ప్రత్యేక అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది.

## ఏఐ సాయం చేసినా.. ట్రిగ్గర్ నొక్కింది మనిషేగా

- ఇరాన్ పాఠశాల దాడిపై అమెరికా మాజీ అధికారి



5

## అమెరికాలో చేరే భారతీయ విద్యార్థుల సంఖ్యలో 39% క్షీణత



## కనిపించకుండా తిరిగే అరుదైన మంచు చిరుతలు



## మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి

మంత్రి టీజీ భరత్



7

# గడువు పొడిగించండి

### హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ



**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర వివాదాస్పదమవుతున్న నేపథ్యంలో వైఎస్సార్సీపీ ఏపీ హైకోర్టును ఆశ్రయించింది. పార్టీ ఎమ్మెల్సీ అప్పిరెడ్డి దాఖలు చేసిన పిటిష్ప విచారణకు హైకోర్టు అనుమతించింది. తన పిటిషన్లో వైసీపీ ప్రధానంగా పలు అంశాలను పేర్కొంది. తమ పార్టీ అభ్యర్థులను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని, గృహనిర్బంధం చేస్తున్నారని వైసీపీ ఆరోపించింది. వెంటనే అభ్యర్థులను విడుదల చేసి,

...మిగతా 2లో




ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

**- ఎడిటర్**



## 13 జిల్లాల్లో 31 ఘర్షణలు

### 54 మందిపై కేసులు నమోదు

### డీజీపీ హరీశ్ కుమార్

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఘర్షణలు, దాడులు చోటుచేసుకోవడంతో, ఈ ఘటనలపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తీవ్రంగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియలో హింసకు పాల్పడేవారు, నామినేషన్లను అడ్డుకునేవారు ఏ పార్టీకి చెందినవారైనా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం 13 జిల్లాల్లో 31 ఘటనలు నమోదైనట్లు వెల్లడించారు. ఈ ఘటనల్లో 22 హింసాత్మక ఘర్షణలు కాగా, 9 నామినేషన్ పత్రాలను చించివేయడం లేదా లాక్కోవడం వంటివి ఉన్నాయి. అత్యధికంగా అనంతపురం జిల్లాలో 8 ఘటనలు జరిగాయి. అన్నమయ్య, కడప,

...మిగతా 2లో

## అంతా తొండి..

### అన్యాయం, దౌర్జన్యంతో

# స్థానిక ఎన్నికలు



- ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది
- సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం బేఖాతర్
- అన్ని కుట్రలకు పితామహుడు చంద్రబాబు
- మాజీసీఎం వైఎస్ జగన్

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని చంద్రబాబు ప్రభుత్వం ఖూనీ చేసిందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ తరఫున జరిగిన పరిణామాలను వివరించడంతో పాటు సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయపోరాటం చేసినట్లు తెలిపారు. సుప్రీం ఆదేశాలతో సీఎం చంద్రబాబు, ఎస్ఈసీ, డీజీపీ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని జగన్

...మిగతా 2లో

## చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నయ్

### వెల్లడించిన ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్



**ఢిల్లీ, అక్టోబర్ 23:** చైనా సరిహద్దు వెంబడి ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోందని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డీజీ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. మరీ ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వద్ద భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ఘర్షణలను ధ్రువీకరిస్తూ వెలువడిన తొలి ప్రకటన ఇదే కావడం గమనార్హం. 'అరుణాచల్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా ఘర్షణలు జరిగాయి. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణల సమయంలో ఐటీబీపీకి చెందిన

...మిగతా 2లో

### మండుతున్న ఎండలు

## ఐరోపా ఖండంలో 50,000 మంది మృతి

### ఉష్ణోగ్రతలు.. వడగాలులతో ఉక్కిరిబిక్కిరి



**లండన్, అక్టోబర్ 23:** శీతల దేశాలకు మారుపేరైన ఐరోపా ఖండం భానుడి ప్రతాపానికి అల్లాడిపోతోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, వడగాలులతో యూరప్ దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. వడదెబ్బకు జూన్ నుంచి ఆగస్టు మధ్యలో రికార్డు స్థాయిలో 50,000కు పైగా మరణాలు సంభవించినట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. శిలాజ ఇంధన కాలుష్యం వల్ల కలిగే వాతావరణ మార్పుల కారణంగానే వీరిలో 32,600 మంది మరణించినట్లు తెలిపారు. ఒక్క యూకేలోనే ఈ వేసవిలో 4,354 మరణాలు సంభవించగా.. మృతుల్లో ఎక్కువ మంది వృద్ధులు ఉన్నట్లు తెలుస్తోంది. బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్,

...మిగతా 2లో

### స్టింగ్ ఆపరేషన్లో కొత్త మలుపు..

## మెటా గ్లాసెస్ వాడారన్న డీకే



2

# అన్యాయం, దౌర్జన్యంతో స్థానిక ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు అంటే గౌరవం లేదని, ప్రజలంటే విలువ లేదని విమర్శించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పరిణామాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు.

**చంద్రబాబు ఎందుకింత తొండి**

అసలు చంద్రబాబు ఎందుకింత తొండి చేస్తున్నారని జగన్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. స్థానిక ఎన్నికల్లో దౌర్జన్యం, అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. మీకు ధైర్యముంటే ఈ ఎన్నికలు ఎదుర్కోవచ్చు కదా? అసలు ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు వీటిని ఎన్నికలు అంటారా? అంటూ చురకలాంటించారు. మహాభారతంలో శకునికి పాచికలు ఉండేవి. ఆయన కోరుకున్నట్లు నెంబర్లు వచ్చేవి. ఇక్కడ నీవు కూడా శకునిలా మారావని, మీ ఇష్టానుసారం ఎన్నికలను నిర్దేశిస్తున్నావని, ఎక్కడెక్కడ ఏం జరగాలో ఆయనే ఆదేశిస్తున్నారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో సక్రమంగా ఎన్నికలు జరగవన్నారు.

**బాబు డైరెక్షన్లోనే...**

మహాభారతంలో శకుని పాచికలు సెట్ చేసినట్లుగా చంద్రబాబు ఎన్నికలను సెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడ నామినేషన్లు వేయాలి.. ఎక్కడ వేయకూడదో అధికార పార్టీనే నిర్ణయిస్తోందని విమర్శించారు. వైసీపీ అభ్యర్థులను అడ్డుకునేందుకు ఎనిమిది రకాలుగా కుట్రలు జరుగుతున్నాయని జగన్ వివరించారు. '15 చోట్ల చైర్మన్ అభ్యర్థులు కూడా లేకుండా పోటీ నడిపిస్తున్నారు. మరికొన్ని చోట్ల చైర్మన్ అభ్యర్థులు ఉన్నా వార్డు సభ్యులు లేకుండా చేశారు. మా పార్టీ అభ్యర్థులకతో ఎందుకు నామినేషన్లు వేయించడం లేదు. ఆ ధైర్యం లేకుండా ఎందుకు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జరిగే ఎన్నికలను ఎన్నికలు అంటారా?. నామినేషన్ల సమయంలోనే పరిస్థితులు ఇలా ఉంటే.. ఎన్నికల రోజు ఎలా ఉంటుంది. మా ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, ప్రజలకు తీసుకొచ్చిన మార్పులను చూపించి ఎన్నికలకు వెళ్లాము. అప్పట్లో చంద్రబాబు మనిషి నిమ్మగడ్డ రమేష్ ఎన్నికల అధికారిగా ఉన్నప్పటికీ ఎన్నికలను ఎదుర్కొన్నాము. ప్రోగ్రెస్ రిపోర్ట్ చూపించి 98 శాతం విజయం సాధించాము. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు' అని విమర్శించారు.

# మీ సైనికుల మృతదేహాలకు మేమే అంత్యక్రియలు చేశాం

- **ఐరాసలో పాక్కు భారత్ చురకలు**

**న్యూయార్క్, అక్టోబర్ 23:** అంతర్జాతీయ వేదిక మీద భారత్పై నిందలు వేయాలని ప్రయత్నించిన పాకిస్థాన్కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన దాయాదికి భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది.

ఐరాస సమావేశంలో పాకిస్థాన్ రాయబారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి భావికా మంగళానందన్ ఖండించారు. జమ్మూకశ్మీర్ భారత్ అంతర్గత విషయమని.. దాని గురించి మాట్లాడే నైతిక హక్కు పాకిస్థాన్కు లేదని స్పష్టం చేశారు. కశ్మీర్పై పెట్టే శ్రద్ధ.. తన ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోని మైనార్టీలపై పెట్టాలని సూచించారు. అనేకమంది మైనారిటీలు కనుమరుగవుతున్నారని.. నిరంతరం వారి హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. మొదట ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. 'అసాధారణ పరిస్థితులలో అంత్యక్రియల హక్కులు.. మత విశ్వాసాలు' అనే అంశంపై చర్చలో మంగళానందన్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. '1999లో కార్గిల్లో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించని ఒక దేశం.. విశ్వాసం, మత స్వేచ్ఛ, ఖననాల గురించి మాట్లాడటం విడ్డూరం. నేను వారికి ఒక విషయం గుర్తు చేయాలనుకుంటున్నాను. వారు తమ సైనికుల మృతదేహాలను దయనీయ పరిస్థితుల్లో వదిలేసిన సమయంలో వాటికి భారత సైన్యమే సైనిక లాంఛనాలతో, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించింది. ఒక ఉగ్రవాది అమాయక ప్రజలను చంపడమే కాకుండా.. ఒక దేశ మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాడు. అలాంటి ఉగ్రవాదుల హక్కుల కోసం ఇంత తీవ్రంగా వాదిస్తున్న పాకిస్థాన్.. ఉగ్రవాద బాధితుల హక్కుల గురించి ఆలోచించకపోవడం ఆశ్చర్యకరం' అని మంగళానందన్ పేర్కొన్నారు.

# గడువు పొడిగించండి

(మొదటి పేజీ తరువాయి)

వారు నామినేషన్లు వేసేందుకు తగిన భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటూ, పత్రాలను చించేస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ దాడులకు ఒడిగట్టిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలని కోరింది. పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నామినేషన్ల గడువును కనీసం 48 గంటల పాటు పొడిగించాలని, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా జిల్లా కార్యాలయాలు, కలెక్టరేట్లలో నామినేషన్లు స్వీకరించేలా ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్సీపీ హైకోర్టును అభ్యర్థించింది.



# 13 జిల్లాల్లో 31 ఘర్షణలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశం జిల్లాల్లో మూడేసి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ దాడుల్లో రెండు కార్లు, రెండు మోటార్సైకిళ్లు సహా నాలుగు వాహనాలకు నిప్పు పెట్టారు. రాళ్లు, కర్రలతో దాడులు, ఒకచోట జేసీబీతో ఇంటిని కూల్చివేయడం, గాల్లోకి కాల్పులు జరపడం వంటి ఘటనలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై జరిగిన రాళ్లదాడిలో కానిస్టేబుల్కు తలకు తీవ్రగాయమైంది. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేసి, 54 మంది నిందితులను గుర్తించినట్లు డీజీపీ తెలిపారు. నిందితులు టీడీపీ, వైసీపీ, సీపీఎం, స్వతంత్రులుగా ఉన్నారని, పార్టీలతో సంబంధం లేకుండా అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులను వెంటనే నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని, సున్నితమైన కేంద్రాల్లో అదనపు బలగాలను మోహరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఎలాంటి బెదిరింపులు లేదా హింసకు గురైనా వెంటనే డయల్ 100 లేదా 112కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

# వెట్టి చాకిరి బానిసత్వ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



## అదనపు కలెక్టర్ వేణుగోపాల్

### కార్మికుల హక్కుల పరిరక్షణకు చట్టాలపై అవగాహన అవసరం

### కార్మికుల శ్రమకు గౌరవం, తగిన ప్రతిఫలం అందేలా చూడాలి

### వెట్టి చాకిరి బాధితుల గుర్తింపు, పునరావాసానికి ప్రాధాన్యం

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 23 (మనంప్రతినిధి):** సమాజంలో కొనసాగుతున్న వెట్టి చాకిరి, బానిసత్వం వంటి అమానవీయ దురాచారాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు, వారి శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభించేలా చూడాలని అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలనపై కార్మిక శాఖ రూపొందించిన వాల్ పోస్టర్ను శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం అసంఘటిత రంగ కార్మికులకు వెట్టి చాకిరి నిర్మూలన, కార్మిక హక్కులు, సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వెట్టి చాకిరి అనేది మానవ హక్కులకు, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే అమానవీయ విధానమని అన్నారు. ఎవరినైనా బలవంతంగా పనులు చేయించడం, శ్రమకు తగిన ప్రతిఫలం చెల్లించకుండా పనిచేయించుకోవడం, కార్మికుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారి శ్రమను దోపిడీ చేయడం వంటి చర్యలను అరికట్టాలని సూచించారు. ప్రతి కార్మికుడికి గౌరవప్రదమైన జీవితం గడిపే హక్కు ఉందని, వారి హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా ధనం' రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమం ద్వారా వెట్టి చాకిరి నిర్మూలన, బాధితుల గుర్తింపు, వారికి పునరావాసం కల్పించడం, కార్మికుల హక్కులపై అవగాహన పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయడం ద్వారా వెట్టి చాకిరి నిర్మూలనకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నట్లు వివరించారు.

వెట్టి చాకిరికి గురవుతున్న కార్మికులను గుర్తించడం, వారికి చట్టపరమైన రక్షణ కల్పించడం, బాధితులకు పునరావాసం అందించడం ఈ కార్యక్రమంలో ముఖ్యమైన అంశాలని తెలిపారు . కార్మికులు తమ హక్కులు, వాటి పరిరక్షణకు అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా బలవంతంగా పనులు చేయిస్తున్నా, వెట్టి చాకిరికి గురిచేస్తున్నా, శ్రమకు తగిన ప్రతిఫలం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వెట్టి చాకిరికి సంబంధించిన ఫిర్యాదులు, సహాయం కోసం

080-69434343 టోల్ ఫ్రీ హెల్ప్లైన్ ద్వారా సంప్రదించి సమాచారం పొందవచ్చని తెలిపారు. కార్మికులు, బాధితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా చట్టపరమైన సహాయం పొందేందుకు ముందుకు రావాలని సూచించారు. ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర పని ప్రదేశాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రచార రథం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, కార్మికులకు చట్టపరంగా కల్పించిన హక్కులు, రక్షణ చర్యలు, ఫిర్యాదు చేసే విధానాలపై అవగాహన కల్పించనున్నారు. కార్మికుల శ్రమకు గౌరవం లభించేలా, వారు చేసిన పనికి తగిన ప్రతిఫలం అందేలా చూడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. వెట్టి చాకిరి, బానిసత్వం వంటి దురాచారాల నిర్మూలనకు ప్రభుత్వ శాఖలు, యజమానులు, కార్మికులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్యామల ప్రమోద్ కుమార్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కె. శ్రీరామ్, సహాయ కార్మిక అధికారులు బి. నాగరాజు, పి.వి.కె. శాస్త్రి, ఎ. యేసుపాదం, చి. రజిత, , ఏహెచ్టీఓ బృందం, ఏఐడీ ఎన్జీఓ ప్రతినిధులు, ఐజేఎం ప్రచార సాధకులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నయ్

(మొదటి పేజీ తరువాయి)

శౌర్య కమాండోలు అసాధారణంగా పనిచేస్తున్నారు' అని శత్రుజీత్ పేర్కొన్నారు. ఐటీబీపీ సిబ్బంది సేవలను గుర్తిస్తూ ప్రతి ఏటా జరిగే సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'పర్వత ప్రాంతంలో పోరాడే గెరిల్లా దళంగా తొలుత ఐటీబీపీని ఏర్పాటు చేశారు. 2004లో మనకు చైనా సరిహద్దు భద్రత బాధ్యతలను అప్పగించారు' అని అన్నారు. చైనాతో మనకున్న బోర్డరే అత్యంత క్లిష్టమైన సరిహద్దు అని ఆయన చెప్పారు. గల్వాన్ తరహా ఘర్షణలను మెరుగ్గా ఎదుర్కోవడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని సిద్ధం చేశామని, భూగర్భ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నామని తెలియజేశారు.

**దేశానికి సమాధానం చెప్పాలి: కాంగ్రెస్**

ఐటీబీపీ చీఫ్ చెప్పిన విషయాలపై కేంద్ర ప్రభుత్వం మౌనాన్ని పాటిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. ఇలా ఘర్షణలు జరుగుతున్నప్పటికీ చైనాకు మాత్రం రాయితీలను కొనసాగిస్తున్నారని దుయ్యబట్టింది. 'లద్దాఖ్ లో మాదిరిగానే పెట్రోలింగ్ పాయింట్లు చేజారిపోయాయని స్థానికులు చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్ లోని ప్రాంతాల పేర్లను చైనా మారుస్తూనే ఉంది. మనకు ముప్పు కలిగించే ఆనకట్టను నిర్మిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ భద్రతకు సంబంధించి స్పష్టమైన సమాధానాలు దేశానికి చెప్పాల్సిందే' అని కాంగ్రెస్ స్పష్టం చేసింది.



## అవ్వ ఐడియా అదుర్స్!

**జగిత్యాల, అక్టోబర్ 23:** జగిత్యాల జిల్లా మల్యాల గ్రామ సమీపంలో కోతుల దాడులకు చెక్ పెట్టేందుకు వీధిలో పండ్లమ్ముకునే అవ్వ ఐడియాకు నెటిజెన్లు, సిటిజెన్లు 'అదుర్స్' అని ప్రశంసిస్తున్నారు. తన చుట్టూ జాలి కట్టుకొని.. మొక్కజొన్న, సీతాఫలం, కీరదోస విక్రయిస్తున్నారు. ఆమె ఆలోచన వల్ల ఎంతోమంది ఆమెకు ఫ్యాన్స్ అయ్యారట. అంతేకాదు, అవ్వ దగ్గరే కొనడానికి ఆసక్తి కూడా చూపుతున్నారని.. దానితో అవ్వ అమ్మకాలు కూడా పెరిగాయని వార్తలు వెలువడుతున్నాయి.

# మీ ప్రమాణం ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు

**ఖమ్మం, అక్టోబర్ 23(మనం న్యూస్):** మీ ప్రమాణం ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు పేర్కొన్నారు. జిల్లా కార్యాలయంలోని మీటింగ్ హాల్లో ఆఫీస్ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మీ ప్రమాణం ఫేషియల్ యాప్ ప్రవేశపెట్టిందని, కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఆదేశానుసారం, ప్రతి ఒక్కరూ మీ ప్రమాణం అటెండెన్స్ వేయాలని ఆదేశించారు. జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేసే సిబ్బంది, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ప్రతి ఒక్కరూ 9 గంటలకు ఇన్, 4 గంటలకు సాయంత్రం అవుట్ అటెండెన్స్ ని మీ ప్రమాణం యాప్లో వేయాలని పేర్కొన్నారు.

ఆఫీస్ సిబ్బంది ఉదయం 10:00 గంటలకు ఇన్ మరియు సాయంత్రం 5 గంటలకు మీ ప్రమాణం యాప్ లో అవుట్ అటెండెన్స్ వేయాలని ఆదేశించారు. ప్రతిరోజు డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం ఆఫీసర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కూడా అటెండెన్స్ వేస్తూ, సిబ్బంది అటెండెన్స్ని ప్రతిరోజు మానిటర్ చేయాలని సూచించారు. మీ ప్రమాణంలో అటెండెన్స్ వేయలేని సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# యూనివర్సిటీ హాస్టల్ రూముల్లో 'యాంటీ సూసైడ్' ఫ్యాన్లు



**గాంధీనగర్, అక్టోబర్ 23:** విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఆత్మహత్యల నివారణకు గుజరాత్లోని వీర్ నర్మద్ సౌత్ గుజరాత్ యూనివర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. హాస్టల్ గదుల్లో విద్యార్థులు ఉరివేసుకొని బలవన్మరణాలకు పాల్పడకుండా ఉండేందుకు వీలుగా ప్రత్యేకంగా రూపకల్పన చేసిన 354 'యాంటీ సూసైడ్' ఫ్యాన్లను ఏర్పాటు చేసింది. గుజరాత్లోనే తొలిసారిగా ఒక విశ్వవిద్యాలయం ఇటువంటి సాంకేతిక భద్రతా చర్యలను చేపట్టడం విశేషం.ఒక్కో ఫ్యాన్ నిమిత్తం సుమారు రూ.1,500 వెచ్చించి ఈ ప్రత్యేక స్ప్రింగ్ పరికరాన్ని అమర్చారు. ఫ్యాన్ పై సాధారణ బరువు కంటే ఎక్కువగా, అంటే సుమారు 10 కిలోలకు మించి భారం (బరువు) పడగానే.. ఇందులోని స్ప్రింగ్ మెకానిజం వెంటనే విడుదలవుతుంది. దీంతో ఫ్యాన్ కిందకు దిగిరావడంతో పాటు, విద్యుత్ సరఫరా కూడా తక్షణమే నిలిచిపోతుంది. ఫ్యాన్ మనిషి బరువును మోయలేకపోవడం వల్ల ఉరివేసుకునే ప్రమాదం నుంచి ప్రాణాలు దక్కుతాయి. ఈ ప్రయోగాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కిషోర్సింహ్ చావ్డా స్వయంగా హాస్టల్ గదిని సందర్శించి ఈ ఫ్యాన్ పనితీరును డెమో ద్వారా ప్రదర్శించారు. ఫ్యాన్ కు దుప్పటి కట్టి కిందకు లాగగా.. స్ప్రింగ్ ఓపెన్ అయ్యి ఫ్యాన్ కిందకు రావడం ఆ వీడియోలో కనిపించింది.

**మానసిక ప్రశాంతత, కౌన్సెలింగ్ కూడా ముఖ్యం**

దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో అకడమిక్ ఒత్తిడి, కెరీర్ ఆందోళనల కారణంగా విద్యార్థుల మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందని, భౌతిక భద్రతా చర్యలు ప్రమాదాలను నివారించినప్పటికీ.. విద్యార్థులకు సకాలంలో కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం అందించడం అత్యంత అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత ఆగస్టులో గుజరాత్కే చెందిన డాక్టర్ హర్ష్ పాండ్యా అనే 30 ఏళ్ల రెసిడెంట్ డాక్టర్ హాస్టల్ గదిలో ఫ్యాన్కు ఉరివేసుకొని మృతిచెందిన ఘటన కలకలం రేపిన సంగతి తెలిసింది.

# పేదరికాన్ని అధిగమించి పీజీ మెడికలో రాణించిన డాక్టర్ రూత్ జాన్ పాల్

**ఖమ్మం, అక్టోబర్ 23(మనం న్యూస్):** ఖమ్మం నగరంలోని రమణగుట్ట మురికివాడకు చెందిన కొయ్యల రూత్ జాన్ పాల్ పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు . నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆమె ఎన్నో కష్టనష్టాలు, అవమానాలను ఎదుర్కొంటూ చదువే లక్ష్యంగా ముందుకు సాగారు. తల్లి దండ్రుల దగ్గర ఉంటూ హైస్కూల్, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అనంతరం వైద్య విద్యపై ఉన్న ఆసక్తితో ఖమ్మంకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ కేవీ కృష్ణారావు తదితరుల సహకారంతో హైదరాబాద్లో ఎంసెట్ కోచింగ్ తీసుకున్నారు . అనంతరం ఎంబీబీఎస్ పూర్తి చేశారు. హైదరాబాద్లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ విభాగంలో పీజీ వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి తన ప్రతిభను చాటుకు న్నారు. పేదరికం తన లక్ష్యానికి అడ్డుకాదని నిరూపిం చిన డాక్టర్ రూత్ జాన్ పాల్ను పలువురు అభినం దించారు. పేదలకు



మెరుగైన వైద్య సేవలు అందించ డంతో పాటు, నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచి సమాజ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# మెటా గ్లాసెస్ వాడారన్న డీకే

**బెంగళూరు, అక్టోబర్ 23:** కర్ణాటక మంత్రులపై కొందరు స్టింగ్ ఆపరేషన్ చేస్తున్నట్లు ఇప్పటికే చెప్పిన ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తాజాగా మరో సంచలన వ్యాఖ్యలు చేశారు. కేరళ సీఎం వీడీ సతీశన్ పైనా, తనపైనా స్టింగ్ ఆపరేషన్ యత్నం జరిగిందని ఆరోపించారు. అందుకోసం మెటా గ్లాసెస్ వాడినట్లు చెప్పారు.

స్థానిక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. నన్ను కలిసేందుకు వచ్చిన ఒక వ్యాపారవేత్త మెటా స్మార్ట్ గ్లాసెస్ దరించడంతో నాకు అనుమానం వచ్చింది. వ్యాపార సంబంధిత విషయాలు మాట్లాడే ముసుగులో రహస్యంగా వీడియో రికార్డు చేసేందుకు యత్నించారు. దాంతో ఆ వ్యక్తి కదలికలు, ఇతర రాజకీయ నాయకులతో జరిపిన సమావేశాల గురించి సమాచారం సేకరించేందుకు ప్రయత్నించాను. అతడు ఎన్డీయే నేతలను కలిసినప్పుడు మాత్రం మెటా గ్లాసెస్ ధరించలేదు. నాతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకొని చేయబోయే భారీ స్టింగ్ ఆపరేషన్ సన్నాహాల్లో ఇది భాగంగా కనిపిస్తోంది.

మంత్రులంతా అప్రమత్తంగా ఉండాలి'' అని డీకే చెప్పారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కుమారస్వామి మాట్లాడుతూ.. మంత్రులను గుప్పిట్లో పెట్టుకునేందుకే ముఖ్యమంత్రి 'స్టింగ్ ఆపరేషన్' నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రులపై ఇదే ఆపరేషన్ చేసిన డీకే శివకుమార్.. ఏకంగా సీఎం పదవిని చేజిక్కించుకున్నారని విమర్శించారు.

# ఐరోపా ఖండంలో 50,000 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

స్పెయిన్, స్విట్జర్లాండ్లలోనూ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈసారి ఐరోపా చవి చూస్తోన్న వడగాల్పులు అతి దారుణమైనవని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. మారుతున్న వాతావరణానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైనందువల్లే ఐరోపా ఇటువంటి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. యూరప్ దేశాలు ఇకనైనా సమన్వయంతో వేగవంతమైన చర్యలు తీసుకోకపోతే పరిస్థితులు మరింత దిగజారే అవకాశం ఉందని హెచ్చరించారు. సహారా ఎడారి నుంచి ఉత్తర దిశగా కదులుతున్న వేడి గాలి, ఎల్నినో ఎఫెక్ట్ వల్లే ఐరోపాలో ఈ హీట్డోమ్ పరిస్థితులు తలెత్తాయని వెల్లడించారు.

# విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన బానోతు నవీన్కు కేంద్ర పురస్కారం

**హైదరాబాద్, అక్టోబర్ 23:** ఇటీవల వన్యప్రాణుల రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అటవీ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్కు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించింది. బానోతు నవీన్ వన్యప్రాణుల సంరక్షణ కోసం చేసిన త్యాగానికి చేసిన కృషిని తెలంగాణ అటవీ దళాల అధిపతి వినయ్ కుమార్ కేంద్రం దృష్టికి తీసుకువెళ్లడంతో కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వన్యప్రాణుల సంరక్షణలో విశేష సేవలందించిన అటవీ సిబ్బంది, స్థానిక సమాజాలు, సంస్థలకు అవార్డులు అందించేందుకు ఎంపిక ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా 'ఫ్రంట్ లైన్ స్టాఫ్ - ప్రొటెక్షన్ అండ్ యాంటీ-పోచింగ్' విభాగంలో దివంగత బానోతు నవీన్ను ఎంపిక చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నవీన్ తెలంగాణ అటవీ శాఖలో చెరువు సింగారం వెస్ట్ బీట్, ముసలిమడుగు సెక్షన్, పాల్వంచ రేంజ్ లో అటవీ



బీట్ ఆఫీసర్గా విధులు నిర్వర్తించారు. వన్యప్రాణుల వేటను అరికట్టడం, వాటి సంరక్షణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన ఆయన సేవలకు ఈ అవార్డు గుర్తింపుగా నిలుస్తుంది. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నవీన్కు మరణానంతరం కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించడం ఆయన కుటుంబానికి, తెలంగాణ అటవీ శాఖకు గౌరవప్రదమైన విషయంగా అటవీ దళాల అధిపతి వినయ్ కుమార్ తెలిపారు.

# అమెరికాలో ఖమ్మం విద్యార్థిని మృతి పట్ల నామ సంతాపం



**ఖమ్మం, అక్టోబర్ 23(మనం న్యూస్):** అమెరికాలోని న్యూయార్క్లో ఉన్నత చదువుల కోసం వెళ్లిన ఖమ్మం కార్పొరేషన్ వాస్తవ్యులు నల్లమల ఆనంద్ కుమార్తె అక్షిత గుండెపోటుతో మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన అక్షిత అకాల మరణం బాధాకరమని పేర్కొన్నారు. అక్షిత మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అక్షిత ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.




# పెనుకొండలో కలెక్టర్ శ్యాం ప్రసాద్ విస్తృత పర్యటన

- స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన
- కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూమ్లు తనిఖీ..
- అధికారులకు కీలక సూచనలు



**పెనుకొండ అక్టోబర్ 23 మనం న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెనుకొండ మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**నామినేషన్ల ప్రక్రియపై సమీక్ష:**

పెనుకొండ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ల పరిశీలనలో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ల తనిఖీ:**

ఎన్నికల నిర్వహణలో కీలకమైన భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పరిటాల డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూమ్లను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రత, కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు.పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలను ముందుగానే సమకూర్చుకోవాలని, ఎన్నికల విధులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచనలు చేశారు.ఈ పర్యటనలో పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, పెనుకొండ డీఎస్పీ శివప్రసాద్, తహసీల్దార్ స్వాతి, స్థానిక ఎన్నికల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎపిక్ సంఖ్యతో ఓటు ఎక్కడుందో తెలుసుకోండి

**కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్):** వచ్చే నెల 1వ తేదీన జరగనున్న కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఓటు వేసేందుకు, తమ ఓటు ఎక్కడ ఉందో ఓటర్లు తమ చరవాణిలోనే తెలుసుకోవచ్చని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్ https://sec&ems.



ap.gov.in లో ఎపిక్ కార్డు సంఖ్యను నమోదు చేస్తే, వార్డు సంఖ్యతో పాటు పోలింగ్ కేంద్రం వివరాలు వస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్సైట్లో కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా వివరాలు అందుబాటులో ఉండవని, ఈ ఎన్నికలకు సంబంధించిన వివరాల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్సైట్ను సందర్శించాలని సూచించారు.

## నామినేషన్లు వేసే అభ్యర్థులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు



**అనంతపురంకలెక్టరేట్, అక్టోబర్ 23 మనం న్యూస్:** రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నామని అనంతపురం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులను ఎవరైనా అడ్డుకున్నా లేదా భయభ్రాంతులకు గురిచేసినట్లు ఫిర్యాదులు వస్తే, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. నామినేషన్ వేసేందుకు వెళ్తున్న సమయంలో ఎవరైనా అడ్డంకులు సృష్టించినా లేదా అడ్డుకున్నా వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారులు, పోలీస్ లేదా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలనీ, ఆ మేరకు పోలీసులు, అధికారులు వారు నిర్భయంగా నామినేషన్ దాఖలు చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారనీ తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులందరి నామినేషన్లను స్వీకరించాలని ఇప్పటికే రిటర్నింగ్ అధికారులకు ( ఆర్వోస్ ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు అధికార యంత్రాంగం నిరంతరం సిద్ధంగా ఉందని, అభ్యర్థులు ఎటువంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ నామినేషన్లను దాఖలు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# కౌంటింగ్ కేంద్రం వద్ద యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

### అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్):** కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం నగర శివార్లలోని అథెనా స్కూల్లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించి, పార్కింగ్, రిసెప్షన్, పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు గదులు, అధికారుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను సమీక్షించారు. ఎన్నికల విధుల కోసం వచ్చే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాల పార్కింగ్కు తగిన స్థలం కేటాయించి, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు, ఓట్ల లెక్కింపు సమయంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీసీపీ శబ్బం శాస్త్రి, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కణేకల్ లో ఎమ్మెల్యే ర్యాలీలో స్వల్ప ఉద్రిక్తత

- నిబంధనలు ఉల్లంఘించి అడ్డంకులు దాటేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు

**కణేకల్ అక్టోబర్ 23 మనం న్యూస్:** పట్టణం లోని శ్రీ చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయం నుండి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు.ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వరకు జరిగిన టీడీపీ నాయకుల అభ్యర్థుల నామినేషన్ల ర్యాలీలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ర్యాలీలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిబంధనలను పట్టించుకోకుండా బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో అక్కడి పరిస్థితి సద్దుమణిగినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు, పోలీసుల సూచనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.



## ఇంకా ఎవరైనా అభ్యర్థులుంటే దాఖలు చేసుకోండి

### ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో నామినేషన్లు దాఖలుకు పూర్తి రక్షణ కల్పిస్తాం

### నామినేషన్ల దాఖలుకు ఎవరైనా అడ్డుకుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలి

### జిల్లా ఎస్పీ పి.జగదీష్

**అనంతపురం, అక్టోబర్ 23 మనం బ్యూరో:** జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో అర్హులైన అభ్యర్థులు ఎలాంటి భయం, ఒత్తిడి, అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని జిల్లా ఎస్పీ పి.జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అభ్యర్థులను నామినేషన్లు దాఖలు



చేయకుండా అడ్డుకోవడం, బెదిరించడం లేదా ఇతర రూపాల్లో ఆటంకాలు కలిగించడం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత ఎస్ హెచ్ ఓ, సి.ఐ లు లేదా డీఎస్పీల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అటువంటి ఫిర్యాదులపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని, నామినేషన్ల దాఖలుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో అభ్యర్థులకు తగిన పోలీసు రక్షణ కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



## కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్న రణబలి ఫేమ్ విజయ్ దేవరకొండ

**గుంతకల్లు, అక్టోబర్ 25 మనం న్యూస్:** రణబలి ఫ్రేమ్ విజయ్ దేవరకొండ శుక్రవారం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయ స్వామి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో విజయరామరాజు తో పాటు వేద పండితులు ఘనంగా స్వాగతం పలికారు స్వామి వారి దర్శనం చేసుకుని అనంతరం విజయ దేవరకొండకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా రణబలి సినిమాలో కసాపురం ఆంజనేయస్వామి దేవాలయం ప్రస్తావన రావడం విశేషం.

## డేటా ఆధారంగా అధికారుల హోదా మేరకు ప్రిసైడింగ్ కేటాయింపు



- పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ పూర్తి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 23 మనం న్యూస్ :** జిల్లాలో జరిగే 2026 మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్లోని ఎన్ఐసి హాలులో పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్, జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు ఐఎఫ్ఎస్ ల సమక్షంలో పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ మాట్లాడుతూ.... జిల్లాలోని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు గుత్తి, గుంతకల్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 689 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇందుకు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధిత హెచ్ఓడి లు ఎంట్రీ చేసిన డేటా ప్రకారం అధికారుల హోదా, ఆధారంగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయక ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలు మొత్తం 4960 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. కేటాయించిన సిబ్బందికి ఈ నెల 24 వ తేదీన నీలం రాజశేఖర్ రెడ్డి కన్వెన్షన్ హాల్ నందు క్లాస్ రూమ్ తరహాలో శిక్షణ నిచ్చి పకడ్బందీ పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 20 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, డి ఐ ఓ భారతి, ఎన్ఐసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

### ఎన్నికలరిటర్నింగ్ అధికారి నాగిని



**సి బెళగల్ అక్టోబర్ 23 మనం న్యూస్:** సి.బెళగల్ మండల కేంద్రంలో గత మూడు రోజుల నుండి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరగడంతో ఎన్నికల అధికారులు తమ సంతోషాన్ని వెలబుచ్చారు అనంతరం శుక్రవారం నాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగిని మాట్లాడుతూ అక్టోబర్ 21 నుండి 23 తేదీ వరకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ లో సి.బెళగల్ మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాలకు 83 నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారిని నాగిని తెలిపారు అందులో భాగంగా అధికార పార్టీ టిడిపికి చెందిన నామినేషన్లు 40 వైసీపీ పార్టీకి చెందిన నామినేషన్లు 35 జనసేన పార్టీకి చెందిన నామినేషన్లు రెండు స్వతంత్ర అభ్యర్థులు ఆరు మొత్తము సి.బెళగల్ మండలంలో 83 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారిని నాగిని తెలిపారు ఎన్నికలలో సహకరించిన ప్రతి అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు ప్రజలు ప్రతి ఒక్కరు ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సమన్వయం చేసుకొని గొడవలు దూరంగా ఉండి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా జరిపిన ప్రతి ఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు అనంతరం ఎస్త్రు వేణుగోపాల్ రాజు మాట్లాడుతూ గత 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు సి.బెళగల్ మండలం ఎంపీడీవో కార్యాలయం నందు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా జరగడంతో ఎస్త్రు వేణుగోపాల్ రాజు ప్రజలకు రాజకీయ పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రశాంతంగా నామినేషన్లు

- నామినేషన్ల కేంద్రాన్ని పర్యవేక్షించిన ఎస్పీ జగదీష్
- 11 మంది వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు
- ఇక ఎన్నికలకు వెళ్లాల్సిందే



**ఆత్మకూరు, అక్టోబర్ 23 మనం న్యూస్:** స్థానిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా జరగాలని ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు రావడంతో పోలీసు యంత్రాంగం తమ వ్యవస్థ యొక్క పవర్ చూపించింది గత రెండు రోజులుగా జరిగిన నామినేషన్లు తీరు ఒక్కసారిగా మారిపోయింది శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి పర్యవేక్షించారు కమాండోలు స్పెషల్ ఫోర్స్ సివిల్ పోలీసులు డిఎస్పి విజయ్ కుమార్ సీఐలు హేమంత్ కుమార్ జయపాల్ రెడ్డి నామినేషన్ ప్రాంతమంతా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు 1 2 పి యాలేరు గొరు దిండ్ల ముట్టాలా వేపచెర్ల సనప తోపుదుర్తి బి యాలేరు తలుపూరు సింగంపల్లి ఎంపీటీసీ స్థానాలకు వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు శాఖలు చేశారు వైసిపి జెడ్పిటిసి అభ్యర్థి జిల్లా పరిషత్ లో గురువారం నామినేషన్ దాఖలు చేసినట్లు వైసీపీ పార్టీ నాయకులు తెలిపారు ఇక నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయిపోయింది టిడిపి వైసిపి అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రచారంలో తమ వంతు పాత్ర నిర్వహించి ప్రజల మద్దతు పొంది జయాపజయాలు తేల్చుకోవాల్సి ఉంది.

## ముగిసిన నామినేషన్ ల ప్రక్రియ



**కాట్రేనికోన అక్టోబర్ 23 మనం ప్రతినిధి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నామినేషన్ ల ప్రక్రియ శుక్రవారం సాయంత్రం 5 గంటలు తో ముగిసింది. కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జి మమ్మీ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బి రాజేశ్వర్ రావు, వి రవి కిరణ్ లు ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. చివరి రోజు 55, మూడు రోజులు కలిసి 109 నామినేషన్లు వచ్చినట్లు ఆర్. ఓ తెలిపారు. ఇందులో టీడీపీ 1 8 వైసీపీ 28, జనసేన 4, బి ఎస్పీ1, సి పి ఎం 2 ఇండిపెండెంట్ 2 ఉన్నాయి. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ ఐ వి దుర్గా శ్రీనివాస్, అదనపు ఎస్ఐ వి సత్యనారాయణ పటిష్టమైన బందోబస్తు నిర్వహిచారు. కాట్రేనికోన నుండీ జడ్పీటీసీ అభ్యర్థులు గా వైసీపీ నుండీ చొల్లంగి శ్రీలక్ష్మి, టీడీపీ నుండి దండుప్రోలు భాగీర్తమ్మ లు నామినేషన్ లు డాఖలు చేశారు ఈ కార్యక్రమంల లో నాగిడి నాగేశ్వరావు, దాట్ల పవన్, ఓగూరి భాగ్య శ్రీ, పి ఎస్ ఎన్ రాజు, నడింపల్లి సూరిబాబు, సందీప్, నడింపల్లి సుబ్బరాజు, గంటి వెంకట సుధాకర్, నాతి సత్యనారాయణ, ఆదినారాయణ దండుప్రోలు సత్యం, బాలయ్య, ఇసుకపట్ల వెంకటేశ్వర రావు , నేలపాటి చంచల రావు, మోకా బాల ప్రసాద్, గిడ్డి రత్న శ్రీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా అభివృద్ధి పనులు

### నిర్మాణ పనులను పర్యవేక్షించిన అన్నవరం దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధర రావు



**అన్నవరం, అక్టోబర్ 23, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర రావు పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న ఎస్ఆర్సీ (ఖిఖి) భవన నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల ప్రస్తుత పురోగతిని సమీక్షించి, నిర్మాణ పనులు ఏ మేరకు పూర్తయ్యాయనే విషయాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవస్థానం కేశఖండనశాలలో నూతనంగా చేపడుతున్న బాత్రూముల నిర్మాణ పనులను పరిశీలించి, అక్కడ భక్తులకు కల్పించనున్న సౌకర్యాలను సమీక్షించారు. భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై దేవస్థానం యంత్రాంగం దృష్టి సారించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మనం Manam



## కవి హృదయం

కావ్యరచనతోడ ,
దర్శించవచ్చు కవి హృదయాన్ని
కావ్య జగత్తులో

కనిపించు కవిహృదయం
ఆతని...
కవితామార్గ సందర్శనంతో

దర్శించవచ్చు కవి హృదాన్ని
పురవర్ణనాది భావాలతో
గ్రహించవచ్చు వాటిని
పదునెనిమిది రమ్య వర్ణనలతో

కవిహృదయ
భావనాపరికల్పితరసరమ్యభావాలు,
రూపుదాలుస్తాయి
రమణీయార్థ పదగుంభనంతో
అతని ఆలోచనామృత కావ్యంగా

ఇంటిని చూస్తే
ఇల్లాల్ని చూసినట్లు
కావ్యాన్ని చదివితే
కవి హృదయం తెలుస్తుంది

ముఖం, స్వభావాలసూచి
కావ్యం, కవిహృదయదర్పణం

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

## ఒకింత

రాలి పడటం లో
ఒకింత హాయి ఉండాలి
సుకుమారంగా
రాలుతున్న పూవును
చూస్తున్నా

ఈ వేళ
చెట్లనుంచి జారిపోతున్న
ఆకులను
ఎలాంటి చప్పుడు చేయకుండా
నేలపైకి చేరుతున్న దృశ్యాలను
చూస్తున్నా

కొమ్మలను నుంచి అల్లుకున్న
ప్రేమను తెంచుకుని పండురాలటం
ఎవరి ఆకలికోసమో
తనువు చాలించిన అందమైన రూపం
మబ్బుల నుంచి రాలుతున్న
చినుకులను చూస్తున్నా

భూమిలో చేరుతున్న నీటి విత్తనాల్లా
క్షణాల్లో వొదిగిపోతున్నవి
నేను కూడా ఒక రోజు
అలా రాలిపోవాలి

**- డా. సుంకర రమేశ్**
9492180764

## స్వర్గం ఎప్పుడూ అంతే..!

స్వర్గంలో ఉండేటోళ్లు దేవుళ్లు, దేవతలు
స్వర్గం కానీ ఈ లోకంలో ఉండేటోళ్లు
దానవులు,మానవులు

పాప - పుణ్యాలు,దాన- ధర్మాలు,
యజ్ఞ - యాగాదులు చేసేవారు !

చావు పుట్టుకలు లేనిది
వారసులుండనిది స్వర్గ లోకం!
అన్నీ ఉండే ఈ లోకం
స్వర్గం కన్నా మిన్న కాదా!

పుట్టుకలు గిట్టుకలుండే ఈ లోకం
ఎప్పుడూ కొత్త కొత్తగానే కదా
స్వర్గం ఎప్పుడూ అంతే కదా
పరిణిమాల ప్రపంచం వింతే కదా!

దేవుళ్ళు ఈలోకానికి వచ్చిపోతారు
దేవుళ్లు దేవతలుగా వెలస్తారు

వాళ్లు కనిపించరు - మనం కనిపిస్తాం
మన శక్తి మేర అమృతత్వం కోసం
కనిపించని వారిని పూజిస్తాం!

**- పట్లోళ్ల బక్కారెడ్డి**
9705315250

# తెలంగాణలో ఐదు రోజుల పని విధానం!



తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్థిక ఆదా, ఉద్యోగుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు అందించే సేవల సామర్థ్యం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది. ఆధునిక పరిపాలనా వ్యవస్థలో ప్రభుత్వ కార్యాలయాల పనితీరును కేవలం ఉద్యోగులు ఎన్ని రోజులు కార్యాలయాలకు హాజరవుతున్నారనే అంశంతో మాత్రమే అంచనా వేయలేం. నిర్దేశించిన సమయంలో ప్రజలకు ఎన్ని సేవలు అందుతున్నాయి, ఫైళ్ల పరిష్కారం ఎంత వేగంగా జరుగుతోంది, ప్రజాధనం ఎంత సమర్థవంతంగా వినియోగమవుతోంది, ఉద్యోగుల ఉత్పాదకత ఎలా ఉంది అనే అంశాల ఆధారంగా పాలనా సామర్థ్యాన్ని అంచనా వేయాలి. ఈ నేపథ్యంలో వారానికి ఐదు రోజుల పని విధానం తెలంగాణ ప్రభుత్వానికి ఆర్థికంగా, పరిపాలనాపరంగా ఎంతవరకు ప్రయోజనకరంగా ఉంటుందో పరిశీలించడం సముచితం.

ప్రభుత్వ కార్యాలయాల్లో పని దినాల విధానం దేశంలోనూ, ప్రపంచంలోని వివిధ పరిపాలనా వ్యవస్థల్లోనూ కాలానుగుణంగా మారుతూ వచ్చింది. ప్రారంభ దశలో అనేక రంగాల్లో వారానికి ఆరు రోజులు, రోజుకు ఎక్కువ గంటలు పని చేసే విధానాలు అమలులో ఉండేవి. కొన్ని దేశాల్లో వారానికి ఐదు రోజుల పని విధానం విస్తరించింది. ప్రభుత్వాలు తమ ఆర్థిక పరిస్థితులు, ప్రజా సేవల అవసరాలు, ఉద్యోగుల విధులు, పరిపాలనా సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకున్నాయి. అందువల్ల తెలంగాణలోనూ ఐదు రోజుల పని విధానం గురించి చర్చించేటప్పుడు ఇతర ప్రాంతాల అనుభవాలను పరిశీలించడంతో పాటు రాష్ట్రానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.

తెలంగాణలో ప్రభుత్వ పరిపాలన విస్తృతమైనది. సచివాలయం నుంచి జిల్లా కలెక్టరేట్లు, మండల కార్యాలయాలు, గ్రామస్థాయి ప్రభుత్వ సంస్థల వరకు అనేక విభాగాలు ప్రజలకు సేవలందిస్తున్నాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్ పరిపాలన, సంక్షేమ పథకాలు, ఉపాధి కార్యక్రమాలు వంటి రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమైనది. కార్యాలయాలు పనిచేసే ప్రతి రోజూ ఈ



వనరుల్లో కొంత భాగం వినియోగమవుతుంది. అందువల్ల పని దినాలను శాస్త్రీయంగా పునర్వ్యవస్థీకరించడం ద్వారా కొంతమేర నిర్వహణ ఖర్చులను తగ్గించే అవకాశం ఉంటుంది.

కార్యాలయాల్లో వారానికి ఐదు రోజుల పని విధానం అమలు చేస్తే కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ఒక ప్రాథమిక అంచనాను రూపొందించవచ్చు. ఉదాహరణకు, రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం తగ్గడం ద్వారా సంవత్సరానికి సుమారు రూ.36 కోట్ల ఆదా, అధికారిక వాహనాల వినియోగం, ప్రయాణాల నియంత్రణ ద్వారా సుమారు రూ.25.20 కోట్ల ఆదా, నీటి వినియోగం, కార్యాలయ నిర్వహణలో సుమారు రూ.18 కోట్ల ఆదా, స్టేషనరీ, ఇతర రోజువారీ నిర్వహణ ఖర్చుల్లో సుమారు రూ.21 కోట్ల ఆదా కలగవచ్చని ఒక నమూనా అంచనా సూచించవచ్చు. ఈ నాలుగు అంశాలను కలిపితే సంవత్సరానికి రూ.100.20 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా వేయవచ్చు. ఈ మొత్తం నెలకు సగటున సుమారు రూ.8.35 కోట్లకు సమానం. ఇదే స్థాయిలో ఆదా ఐదేళ్లపాటు కొనసాగితే సుమారు రూ.501 కోట్లకు చేరవచ్చు.

ఐదు రోజుల పని విధానం ఉద్యోగుల ఆరోగ్యం, కుటుంబ జీవితం, మానసిక ప్రశాంతతకు కూడా తోడ్పడవచ్చు. ప్రభుత్వ ఉద్యోగులు రోజువారీ విధులతో పాటు కుటుంబ బాధ్యతలు, పిల్లల చదువులు, వృద్ధుల సంరక్షణ, వ్యక్తిగత అవసరాలను సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. వారానికి రెండు రోజులు విశ్రాంతి లభించడం వల్ల కుటుంబ సభ్యులతో గడిపే సమయం పెరగవచ్చు. సరైన విశ్రాంతి, పని ఒత్తిడిని నియంత్రించే వాతావరణం ఉద్యోగుల ఉత్సాహాన్ని పెంచవచ్చు. అయితే వారానికి ఐదు రోజుల పని విధానం మాత్రమే ఉద్యోగుల సంక్షేమానికి హామీ కాదు. కార్యాలయాల్లో పనిభారం సమతుల్యంగా ఉండాలి. ఉద్యోగుల సంక్షేమం, పరిపాలనా సామర్థ్యం పరస్పరం సంబంధం కలిగిన అంశాలు. ఉద్యోగులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా, స్పష్టమైన బాధ్యతలతో పనిచేసే వాతావరణం ఉంటే ప్రజలకు అందించే సేవల నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది. అయితే పని దినాలు తగ్గినంత మాత్రాన ఉత్పాదకత తప్పనిసరిగా పెరుగుతుందని చెప్పలేం.

పర్యావరణ పరిరక్షణ పరంగా కూడా ఐదు రోజుల పని విధానం కొంత ప్రయోజనాన్ని అందించవచ్చు. వాయు కాలుష్యం కొంత తగ్గవచ్చు. కార్యాలయాల్లో కాగితం వినియోగాన్ని తగ్గించి డిజిటల్ దస్త్రాల వ్యవస్థను విస్తరించడం ద్వారా చెట్లపై ఒత్తిడిని తగ్గించవచ్చు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించడం, వ్యర్థాల వేర్పాటు, పునర్వినియోగం, సౌర విద్యుత్ వంటి చర్యలను అమలు చేయడం ద్వారా పర్యావరణహిత పరిపాలనకు మార్గం సుగమమవుతుంది. అయితే పర్యావరణ ప్రయోజనాలను కూడా వాస్తవ వినియోగం,

ఐదు రోజుల పని విధానం అమలుపై నిర్ణయం తీసుకునే ముందు తెలంగాణ ప్రభుత్వం ప్రయోగాత్మక విధానాన్ని అనుసరించవచ్చు. ముందుగా కొన్ని సాధారణ పరిపాలనా కార్యాలయాలను ఎంపిక చేసి, నిర్దిష్ట కాలానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలి. ప్రతికూల ఫలితాలు కనిపిస్తే విధానంలో అవసరమైన మార్పులు చేయాలి.

ఐదు రోజుల పని విధానం అమలులో ఉద్యోగ సంఘాలు, శాఖాధిపతులు, ఆర్థిక విభాగం, పరిపాలనా నిపుణులు, ప్రజాప్రతినిధులు, పౌర సమాజ ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. పని దినాల మార్పు వల్ల ప్రభుత్వ సేవలు ఆలస్యం కాకుండా, అత్యవసర అవసరాలు నిర్లక్ష్యం కాకుండా ముందస్తు ప్రణాళిక అవసరం.

మొత్తంగా తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాల్లో వారానికి ఐదు రోజుల పని విధానం అమలు చేయాలా వద్దా అనే ప్రశ్నకు కేవలం అనుకూలత లేదా వ్యతిరేకత రూపంలో సమాధానం చెప్పడం కంటే, దాని ఆర్థిక, పరిపాలనా, సామాజిక ప్రభావాలను శాస్త్రీయంగా పరిశీలించడం అవసరం. ప్రభుత్వ పరిపాలనలో అసలైన లక్ష్యం పని దినాలను తగ్గించడం మాత్రమే కాదు. పరిమిత ప్రజాధనాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడుతూ, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలను అందించడం. ఈ మూడు లక్ష్యాలను సమన్వయం చేయగలిగితే ఐదు రోజుల పని విధానం తెలంగాణలో ఆధునిక, పొదుపుతో కూడిన, ప్రజాకేంద్రీకృత పరిపాలనకు ఒక అవకాశంగా మారవచ్చు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని విధానం ఏదైనా కావచ్చు. ప్రజల సమస్యలకు సకాలంలో పరిష్కారం లభించడం, ప్రభుత్వ ఖర్చులు నియంత్రణలో ఉండటం, ఉద్యోగులు ఉత్సాహంగా పనిచేయడం, పర్యావరణం పరిరక్షించబడటం అనే లక్ష్యాలే పరిపాలన విజయానికి నిజమైన కొలమానాలు కావాలి.

**- డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**

# ప్రకృతి విపత్తుపై రాజకీయ బురదజల్లుడేంది?



ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు పాలకుల పరిణతి, ప్రతిపక్షాల స్పందన ఒక సమాజం యొక్క ప్రజాస్వామ్య దృక్పథాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని ఎత్తిచూపుతాయి. ప్రస్తుతం తెలంగాణ సమాజం తీవ్రమైన వర్షాభావం, ఊహించని ఎల్‌నినో వాతావరణ పరిణామాల వల్ల భయంకరమైన నీటి ఎద్దడి, విద్యుత్ కొరత ఎదుర్కొనే ప్రమాదంలో పడింది. ఐక్యరాజ్యసమితి హెచ్చరికలు, ప్రపంచ శాస్త్రవేత్తల పరిశోధనలు వందకు పైగా దేశాల్లో ఎల్‌నినో ముప్పు తీవ్రంగా ఉండబోతోందని తేల్చిచెప్పాయి. భారతదేశంలోని అనేక రాష్ట్రాలు ఎండల తీవ్రతకు, నీటి కొరతకు అల్లాడుతున్నాయి. ఇటువంటి తరుణంలో, ఇది కేవలం ప్రకృతి సృష్టించిన గ్లోబల్ వైపరీత్యమని తెలిసీ, తెలంగాణలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితులకు ప్రభుత్వంపై నెపం నెడుతూ బిఆర్ఎస్, టిఆర్ఎస్, బిజెపి నాయకులు 'కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని విషప్రచారం చేయడం అత్యంత హేయమైన, బాధ్యతారాహిత్యమైన రాజకీయ దిగజారుడు తనానికి ప్రత్యక్ష నిదర్శనం.

ఎల్‌నినో అనేది మానవుల చేతుల్లో లేని అంతర్జాతీయ పర్యావరణ వ్యవస్థ మార్పు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల రుతుపవనాలు తీవ్రంగా బలహీనపడతాయి. గతేడాది ఇదే సమయానికి తెలంగాణ రిజర్వాయర్లలో 462 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటే, ఈరోజు అది 200టీఎంసీలకు పడిపోవడం ఎవరి వైఫల్యం? మానవ ప్రమేయం లేకుండా వానలు పడకపోవడం ప్రకృతిశాపం కాదా? అలాగే, రాష్ట్రావిర్భావం నాటి కంటే విద్యుత్ డిమాండ్ ఏకంగా 20,000 మెగావాట్లకు చేరడం, చలికాలం ప్రారంభంలోనే మార్చి నెలను తలపించేలా 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం వంటి అంశాలు శాస్త్రీయ నగ్న సత్యాలు. ఈ క్రమంలో, పరిస్థితి





తీవ్రతను గ్రహించి ప్రజలను ముందే అప్రమత్తం చేయడం పాలకుడి బాధ్యత. ముఖ్యమంత్రి ఆ ధైర్యం చేసి, దాచకుండా నిజాన్ని ప్రజల ముందు ఉంచారు.

ప్రభుత్వం సంక్షోభ నివారణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు ప్రారంభించింది. అందుబాటులో ఉన్న నీటిని సాగు కంటే తాగునీటికే మొదటి ప్రాధాన్యతగా కేటాయించడం, రాబోయే 8 నుండి 10 నెలలు పొదుపు చర్యలు పాటించాలని కోరడం బాధ్యతాయుతమైన ముందస్తు ఆలోచన. ఎండాకాలం వరి పంటలు వేసి నీరు అందక పెట్టుబడులు కోల్పోయి, మోటార్లు కాలిపోయే దయనీయ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ఒక సీజన్ వాయిదా వేసుకోవాలని, ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని కోరడంలో రైతు సంక్షేమం కాక మరేముంది? దీనిని 'కరువు'గా చిత్రీకరిస్తూ రైతులను రెచ్చగొట్టడం ద్వారా ప్రతిపక్షం ఏం సాధించాలనుకుంటోంది? రైతును ఆదుకోవడానికి ఎంత మూల్యమైనా చెల్లించి బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తామని స్పష్టం చేస్తున్నప్పుడు అభినందించాల్సింది పోయి, శవ రాజకీయాలు చేయడం పైశాచికం కాదా?

సంక్షోభాన్ని అధిగమించడానికి ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతోంది. 2.5 లక్షల మంది ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడం, పశుగ్రాసం అభయారణ్య నిల్వలు పెంచడం, తాగునీటి సరఫరాను 24 వేల గ్రామాలకు సజావుగా అందించడం, వైద్య ఆరోగ్యశాఖను అత్యవసరంగా సన్నద్ధం చేయడం ద్వారా ఒక సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేసింది. వీటికి తోడు ప్రత్యేక వార్ రూమ్, టోల్ ఫ్రీ నంబర్, సీనియర్ అధికారితో నోడల్ ఆఫీస్ పర్యవేక్షణ, సబ్‌కమిటీ ఏర్పాటు వంటివి యంత్రాంగం యొక్క పారదర్శకతను నిరూపిస్తున్నాయి.

అంతేగాక, రాజకీయాన్ని పక్కనబెట్టి అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని, నవంబర్ మొదటి వారంలో ప్రతిపక్షాల ప్రతినిధులతో కలిసి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రిని కలిసి కేంద్ర విపత్తు నిధులు, అదనపు విద్యుత్ పూల్ సాధిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు, పౌరసమాజం ఏకతాటిపైకి వచ్చి ప్రకృతి విపత్తుపై పోరాడాలని పిలుపునిచ్చినప్పుడు, దానిని ఆసరాగా చేసుకుని విషం చిమ్మడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే.

కరువు లేదా నీటి ఎద్దడి అనేది శాస్త్రీయ కారణాల వల్ల సంభవించే వైపరీత్యం. అంతర్జాతీయ స్థాయిలో శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న ఎల్‌నినో పరిస్థితులను 'కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని వ్యాఖ్యానించడం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన వర్గాల అజ్ఞానానికి, తీవ్ర అసహనానికి నిదర్శనం. అధికారం కోల్పోయిన ఆక్రోశంతో ప్రజలను భయాందోళనలకు గురిచేయడం, భ్రమలు కల్పించి రైతాంగాన్ని నష్టాల్లోకి నెట్టాలని చూసే కుట్రలు తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉంది.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్ర కేవలం నిందించడం కాదు. ఆపదలో ఉన్న ప్రజలకు ధైర్యాన్ని ఇవ్వడం, ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేయడం. కష్టకాలంలో రైతులను రెచ్చగొట్టి పెట్టుబడులు నష్టపోయేలా చేయడం శ్రేయస్కరం కాదు. ప్రతిపక్షాలు తమ సంకుచిత రాజకీయ స్వార్థాన్ని, బురదజల్లే నైజాన్ని పక్కన బెట్టి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఇది రాజకీయం చేసే సమయం కాదు, ప్రజా రక్షణకు భుజం భుజం కలిపి నిలబడాల్సిన సమయం! ఇప్పటికైనా అబద్ధాల ప్రచారాన్ని కట్టిపెట్టి, ఎల్‌నినో విపత్తును జయించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణలో ప్రతిపక్షాలు భాగస్వామ్యమవ్వాలి!

**- వెంక గారి భూమయ్య**
984559863

## పరిణతి లేని పరిణామాలు

పరిణతిలేని నేటి
రాజకీయ పరిణామాలు
త్వరిత గతిగా మార్పు చెందుతూ
ముందుకు వెళుతున్నాయి
అన్ని విధాల అభివృద్ధికి ఆటంకమై
అడ్డుపడుతున్నాయి
వ్యతిరేక దిశలో వడగాలులై
వీస్తున్నాయి
వర్గాల మధ్య వాడి వేడి
సెగలను పుట్టిస్తున్నాయి
విచ్ఛిన్నమైన శక్తులుగా
ఎదుగుతున్నాయి
బాధ్యత లేకుండ
బహురూపులై తిరుగుతున్నాయి
భ్రష్టు పట్టిన విధానాలను అనుసరిస్తు
అపజయాల బాటను ఎంచుకొంటున్నాయి
ప్రతి ఫలం ఇవ్వని పనులను
అమలుచేస్తున్నాయి
చిత్త శుద్ధిలేకుండ చచ్చి చెడి
బతుకుతున్నాయి
బలమైన వేర్లతో నేలలోకి నూనుకొని
పోతున్నాయి
బలమైన ఊడల మర్రిల ఊగుతూ
భయపెడుతున్నాయి
నీళ్లు లేని ఎడారిలోని
నాగజేముళ్లను తలపోస్తున్నాయి
త్వరిత గతిగా మార్పు చెందుతూ ఒకింత
ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి
ఒళ్ళు గగ్గురు పొడిచే నిజాలను బయట
పెడుతున్నాయి!!

**- ఎస్. జవేరియా**
9849931255

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్**

# మరో ప్రపంచ యుద్ధాన్ని ఐరాస ఆపగలదా?

ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయచట్టం, భద్రత, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, మానవ హక్కులపై సమష్టి కృషి చేసేందుకు ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక అంతర్జాతీయ సంస్థ. 20వ శతాబ్దం మానవాళిని అతలాకుతలం చేసింది. 1930 నాటి మహామాంద్యం వల్ల ఐరోపాలో నియంతలు అధికార పీఠాలు అధిరోహించారు. ఆపై సంభవించిన రెండో ప్రపంచ యుద్ధం, మానవాళి చరిత్రనే రక్తాక్షరాలతో లిఖించింది. అలాంటి పరిస్థితుల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఒక బహుముఖీన అంతర్జాతీయ సంస్థ అవసరమని ప్రపంచ నాయకులు భావించారు. ఆ భావనకు ఒక రూపం కల్పించారు. తరవాత అదే ఐక్యరాజ్య సమితిగా ఆవిర్భవించింది. నానాజాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్) రెండవ ప్రపంచ యుద్ధాన్ని నివారించుటలో విఫల మవడంతో దానికి ప్రత్యామ్నాయంగా 1945లో ఐక్యరాజ్య సమితి స్థాపించ బడింది. ప్రతి సభ్య దేశమూ ఐరాస సాధారణ సభలో సభ్యత్వం కలిగి ఉంటుంది. ఐరాస చార్టర్ 2వ ఛాప్టర్ 4వ ఆర్టికల్ ప్రకారం ఏదైనా దేశానికి ఐరాస సభ్యత్వం రావాలంటే ఐరాస భద్రతా సభ ఆమోదంపై, ఐరాస సాధారణ సభ తీర్మానం జరగాలి. నియమాల ప్రకారం సంపూర్ణ ఆధిపత్యం ఉన్న దేశాలు మాత్రమే సభ్యత్వానికి అర్హత కలిగి ఉంటాయి. కాని ఐరాస ఏర్పాటు సమయంలో చేరిన నాలుగు ఆరంభ సభ్య దేశాలకు (బెలారస్, భారతదేశం, ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్) అప్పటికి సంపూర్ణ స్వాతంత్ర్యం లేదు. అంతే కాకుండా భద్రతా సభ ఆమోదం ఉండాలన్న నిబంధన కారణంగా మాంటివిడియో కన్వెన్షన్ ప్రకారం స్వాధిపత్యం కలిగిన కొన్న దేశాలు కూడా, మరి కొన్ని ఐరాస సభ్య దేశాలు వ్యతిరేకించిన కారణంగా ఐరాస సభ్యత్వం కలిగి లేవు. 1945లో ఐరాస ఏర్పడినప్పుడు 51మంది సభ్య దేశాలున్నాయి. వాటిలో 49 దేశాలు ఇప్పటికీ సభ్యులుగా ఉన్నాయి. లేదా వారి సభ్యత్వం వేరే దేశాలకు సంక్రమించింది. ఉదాహరణకు సోవియట్ యూనియన్ సభ్యత్వం రష్యాకు సంక్రమించింది. ప్రస్తుతం 193 దేశాలు ఐక్యరాజ్య సమితిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితిలో ప్రధానంగా 6 అంగాలు ఉన్నాయి. సర్వప్రతినిధి సభలో ఐక్యరాజ్య సమితిలో ప్రవేశించిన అన్ని దేశాలకు సభ్యత్వం ఉండగా,భద్రతామండలిలో 15 దేశాలకు మాత్రమే సభ్యత్వం ఉంటుంది. అందులో 10 దేశాలు రెండేళ్ళ కోసారి ఎన్నిక ద్వారా సభ్యత్వం పొందగా,అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్‌లు శాశ్వత సభ్యదేశాలు. ప్రధాన కార్యాలయం న్యూయార్క్‌లో ఉంది. దీని ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుట్టెర్స్. ఐక్యరాజ్య సమితి స్థాపించబడిన అక్టోబరు 24వ తేదీని ప్రతి సంవత్సరం ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా పాటిస్తారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలోనే 1941 ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్, బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అట్లాంటిక్ సముద్రంలో ఒక ఓడలో సమావేశమై కుదుర్చుకొన్న ఒప్పందాన్ని అట్లాంటిక్ ఛార్టర్ అంటారు. ప్రాదేశిక సమగ్రత కాపాడడం, యుద్ధభయాన్ని తొలగించడం, శాంతిని నెలకొల్పడం, నిరాయుధీకరణ వంటి ఎనిమిది అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ ఒప్పందమే తరువాత ఐక్య రాజ్య సమితి సిద్ధాంతాలకు మౌలిక సూత్రాలుగా గుర్తింపు పొందినది.

తరువాత 1944లో వాషింగ్టన్‌లోని డంబార్టన్ ఓక్స్ వద్ద




జరిగిన సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా ప్రతినిధులు ఐరాస ప్రకటన పత్రం ముసాయిదాను తయారు చేశారు. 1945 ఫిబ్రవరిలో యాల్టా సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా నేతలు ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఒక అంతర్జాతీయ సంస్థను స్థాపించాలని తీర్మానం చేశారు. శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో 1945 ఏప్రిల్ 25నుండి జూన్ 26 వరకు జరిగిన అంతర్జాతీయ సమావేశంలో 51 దేశాల ప్రతినిధులు పాల్గొని ఐక్య రాజ్య సమితి ఛార్టర్‌పై సంతకాలు చేశారు. 1945 అక్టోబరు 24న న్యూయార్క్‌లో ఐక్య రాజ్య సమితి లాంఛనంగా ప్రారంభమైంది.

యుద్ధాలు జరగకుండా చూడటం,అంతర్జాతీయ తగాదాలను శాంతి యుతంగా పరిష్కరించడం, దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడం, అంతర్జాతీయ బాధ్యతలను అన్ని దేశాలు గౌరవించేటట్లు చేయడం, సాంఘిక అభివృద్ధి సాధించి, మానవ జీవితాలను సుఖమయం చేయడం తదితరాలు సమితి ఆశయాలు. అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ 'యునెటైడ్ నేషన్స్' అనే పదాన్ని తొలిసారి ప్రవేశ పెట్టాడు. ఐరాస పతాకాన్ని 1947 అక్టోబరు 20న ఆమోదించారు. ఈ పతాకం లేత నీలం, తెలుపు రంగుల్లో ఉంటుంది. పతాకం మధ్యలో ఐరాస చిహ్నమైన ప్రపంచ పటం రెండు ఆలివ్ కొమ్మల మధ్య ఉంటుంది. ఆలివ్ కొమ్మలు శాంతికి చిహ్నం. ఐరాసకు ఆరు అధికారిక భాషలున్నాయి అవి చైనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్, అరబిక్. ఐక్యరాజ్య సమితికి 6 ప్రధానాంగాలు ఉన్నాయి...

సర్వ ప్రతినిధి సభ: సభలో సభ్యదేశాలన్నింటికీ ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రతి దేశానికి సమానంగా ఒక్క ఓటు ఉంటుంది. సమావేశాలకు ప్రతి సభ్యదేశం గరిష్ఠంగా 5 గురు సభ్యులను పంపవచ్చు. ఈ సభ సంవత్సరానికి ఒక పర్యాయం, సాధారణంగా సెప్టెంబరులో సమావేశమవుతుంది.

భద్రతా మండలి: సమితి ప్రారంభమయ్యేనాటికి ఇందులో సభ్యదేశాల సంఖ్య 11. ప్రస్తుతం 15 సభ్యదేశాలు ఉన్నాయి. అందులో 5 శాశ్వత సభ్యదేశాలు.. రెండేళ్ళ కాల వ్యవధి కొరకు ఎన్నికయ్యే తాత్కాలిక సభ్య దేశాలు పది. ఈ శాశ్వత సభ్యదేశాలకు వీటో అధికారం కూడా ఉంది.

సచివాలయం: ఇది ఐరాస వ్యవహారాలు నిర్వహించే కార్యనిర్వాహక విభాగం. దీని ప్రధాన కార్యాలయం న్యూయార్క్‌లో ఉంది. సచివాలయ ప్రధానాధికారిని సెక్రటరీ జనరల్ అంటారు.

ధర్మకర్తృత్వ మండలి: కొన్ని పాశ్చాత్య దేశాల వలస పాలన క్రింద కొనసాగిన భూభాగాల ప్రయోజనాలను కాపాడడం ఈ మండలి లక్ష్యం.

ఆర్థిక, సాంఘిక మండలి: ఇది సాధారణ సభ అధ్వర్యంలో పనిచేస్తుంది. ఇందులో 54 మంది సభ్యులుంటారు. ప్రజల జీవన స్థాయిని మెరుగు పరచడం, విద్య, సాంస్కృతిక, ఆరోగ్య రంగాలలో అంతర్జాతీయ సహకారానికి కృషి చేయడం, మానవ హక్కులను సమర్థించడం వంటివి ఈ మండలి ఆశయాలు.

అంతర్జాతీయ న్యాయస్థానం: ఇది 'ప్రపంచ న్యాయస్థానం' గా పిలువ బడుతుంది. ఐక్యరాజ్య సమితి యొక్క ప్రాథమిక తీర్పులను ప్రకటిస్తుంది. దీని కేంద్రం నెదర్లాండ్‌లోని హేగ్ నగరంలోఉంది.

ఐతే ప్రపంచాన్ని వణికిస్తున్న తీవ్రవాదాన్ని నివారించడంలో సమితి విఫలం అయ్యింది. ఐక్యరాజ్య సమితిలోని అగ్ర రాజ్యాల ఆధిపత్యం కొనసాగు తుండటం చిన్న దేశాలకు శాపంగా మారుతున్నది. అగ్రరాజ్యాల చేతిలో ఉన్న ఐరాస తన లక్ష్యాలను నెరవేర్చలేక పోతున్నది. కాలం గడుస్తున్న కొద్దీ ఐరాస బలహీన పడుతున్నదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తు న్నాయి. 80 ఏళ్ళ పాటు ప్రపంచ శాంతికి అవిరళమైన కృషి చేసిన ఐరాస మరో ప్రపంచ యుద్ధం రాకుండా చూసి, మానవాళిని కాపాడ గలదని మనసారా ఆశిద్దాం.

**అక్టోబర్ 24... ఐక్యరాజ్య సమితి దినోత్సవం**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# గొల్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం.. ఫామ్ పాండ్ పనుల పరిశీలన

- ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- రెండో విడతలో ఇద్దరు లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల అందజేత
- ఫామ్ పాండ్ పనుల పరిశీలన, చేపల పెంపకంతో అదనపు ఆదాయం



**కామారెడ్డి, అక్టోబర్ 23 (మనం బ్యూరో):** ర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఎల్నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని రైతులకు సూచించారు. శుక్రవారం రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో పర్యటించిన కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయడంతో పాటు వ్యవసాయ క్షేత్రంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను పరిశీలించారు.

**పేదల సొంతింటి కల సాకారం కావాలి**

ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో భాగంగా గొల్లపల్లికి చెందిన అటికెల భూమయ్య, గణేష్‌కు కలెక్టర్ మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం వారి ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి, కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు సొంతింటిని కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులు మంజూరైన ఇళ్లను ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మించుకోవాలని సూచించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని, ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**నీటి సంరక్షణతో పాటు అదనపు ఆదాయం.**

గొల్లపల్లి పరిధిలో కందూరి భూలక్ష్మి రైతు పొలంలో నిర్మాణంలో ఉన్న వ్యవసాయ క్షేత్రపు నీటి కుంట (ఫామ్ పాండ్) పనులను కలెక్టర్ పరిశీలించారు. వర్షపు నీటిని ఫామ్ పాండ్లలో నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు దోహదపడటంతో పాటు పంటలకు అవసరమైన సమయంలో సాగునీటిని వినియోగించుకోవచ్చని తెలిపారు. కుంటల్లో చేపల పెంపకం చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

**ఎల్నినో ప్రభావం దృష్ట్యా నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు**

ఎల్నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, తక్కువ నీటితో పండే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. ప్రతి నీటి బొట్టును సమర్థంగా వినియోగించుకుంటూ నీటి వనరులను పరిరక్షించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకొని మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో దామోదర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈ (పంచాయతీరాజ్) సురేష్, ఏఈ (ఆర్డబ్ల్యూఎస్) విష్ణువర్ధన్, ఏఈ (ట్రాన్స్కో) సుధాకర్, ఏపీవో ధర్మారెడ్డి, సర్పంచి కిషన్ యాదవ్, ఉపసర్పంచి మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి పాల్గొన్నారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

- వన మహోత్సవ మొక్కలకు నీరు పోసిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- మొక్కల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపు కీలకం, మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలి



**కామారెడ్డి, అక్టోబర్ 23 (మనం బ్యూరో) :** వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించి, అవి ఆరోగ్యంగా పెరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మొక్కలు నాటడంతోనే బాధ్యత ముగియదని, వాటిని పరిరక్షించి పెంచినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం నిర్వహించిన మొక్కలకు నీరు పోసే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. వన మహోత్సవం సందర్భంగా నాటిన మొక్కలకు స్వయంగా నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, గ్రామాల్లో పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించాలని, అవి ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం, సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.

**పచ్చదనం పెంపునకు ప్రజలు సహకరించాలి**

గ్రామాల్లో నాటిన మొక్కల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వాటి ఎదుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకొని పచ్చదనం పెంపునకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహసీల్దార్ ఉమలత, ఏఈ (పంచాయతీరాజ్) సురేష్, ఏఈ (ఆర్డబ్ల్యూఎస్) విష్ణువర్ధన్, ఏఈ (ట్రాన్స్కో) సుధాకర్, ఏపీవో ధర్మారెడ్డి, సర్పంచి కిషన్ యాదవ్, ఉపసర్పంచి మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు

- రాగట్లపల్లిలో కూరగాయల పంటలను పరిశీలించిన పట్టు పరిశ్రమ జిల్లా అధికారి జ్యోతి



**కామారెడ్డి, అక్టోబర్ 23 (మనం బ్యూరో):** ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి రైతులకు సూచించారు. శుక్రవారం భిక్కనూరు మండలం రాగట్లపల్లి గ్రామంలో కూరగాయల పంటలను ఆమె పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల స్థితిగతులు, నీటి లభ్యతపై రైతులతో చర్చించారు. కూరగాయల సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉందా? పంటల పరిస్థితి ఎలా ఉందని రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పంటలకు సరిపడా నీరు ఉందని, కూరగాయల పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు వివరించారు.

**నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి**

ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ., నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ముందస్తు ప్రణాళికతో పంటలకు అవసరమైన నీటిని అందిస్తూ దిగుబడులను కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# నిరసనలకు నిధుల ఆరోపణలు..

- ఆర్థిక రికార్డులు ఇవ్వబోం
- నెవిల్ రాయ్ సంస్థలు

**వాషింగ్టన్, అక్టోబర్ 23 :** వివాదాస్పద అమెరికా వ్యాపార దిగ్గజం నెవిల్ రాయ్ సింగంకు చెందిన సంస్థల ఆర్థిక రికార్డులను అప్పగించాలని కొద్ది రోజుల క్రితం యూఎస్ కాంగ్రెస్ ఆదేశాలు జారీచేసింది. ఈ సంస్థలు ఫ్రాన్స్ సహా పలు దేశాల్లో పోయడంలోనూ బ్రేక్‌త్రూ న్యూస్‌కు సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నెట్‌వర్క్ ఫ్రాన్స్‌కే పరిమితం కాకుండా అమెరికా, యూకే, గ్రీస్, బ్రెజిల్, భారత్ వంటి దేశాలకూ విస్తరించినట్లు యూఎస్ కాంగ్రెస్ తెలిపింది. అల్లర్లకు మద్దతుదారులను సమీకరించడం, సమ్మెలకు పిలుపునివ్వడం, అంతర్జాతీయ మీడియా సంస్థల ద్వారా ప్రదర్శనలను విస్తృతం చేయడం వంటి పనులను ఈ సంస్థలు



నిరసనలకు నిధులు సమకూరుస్తున్నట్లు ఇటీవల అమెరికాకు చెందిన మీడియా పరిశోధనాత్మక కథనం వెలువరించిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. అమెరికా వేస్ అండ్ మీన్స్ హౌస్ కమిటీ ఆదేశాలను తాజాగా సదరు సంస్థలు (ది పీపుల్స్ ఫోరమ్ ఇంక్., బ్రేక్త్రూ న్యూస్) తిరస్కరించాయి. తమ ఆర్థిక రికార్డులను ఇవ్వబోమని స్పష్టం చేశాయి.

నెవిల్ రాయ్ సంస్థల నుంచి విదేశాలకు నిధుల మళ్లింపుపై కొంతకాలంగా చట్టసభ సభ్యులు దర్యాప్తు చేస్తున్నారు. అమెరికా సహా పలు దేశాల్లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి వీరు లక్షల డాలర్లను వెచ్చిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో పెద్ద ఎత్తున జరుగుతోన్న విద్యార్థి నిరసన ఉద్యమానికి ఆజ్యం చేస్తున్నాయంది. ఈ క్రమంలోనే భారత్‌లో సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనలు, గతంలో చేపట్టిన భారత్ జోడో యాత్రలకు నెవిల్ రాయ్ సంస్థలతో సంబంధం ఉందా? అని బీజేపీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. విదేశీ పర్యటనల పేరుతో కాంగ్రెస్ అగ్రనేత దేశ వ్యతిరేక శక్తులను కలుస్తున్నారని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ఆరోపించారు. దేశాన్ని అస్థిర పరిచేందుకు రాహుల్ దుష్టశక్తులతో కలిసి ప్రణాళికలు రచిస్తున్నారన్నారు. భారత్‌లో చైనాకు అనుకూలంగా వార్తలను ప్రచారం చేయడానికి నెవిల్ రాయ్ సంస్థల నుంచి భారతీయ వార్తా పోర్టల్ 'న్యూస్‌క్లిక్'కు కోట్లాది రూపాయల నిధులు అందాయని గతంలో ఈడీ వెల్లడించిన విషయం తెలిసిందే.

# భారత్, పోలండ్ రక్షణ బంధం

### 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు వాణిజ్యం

### మోడీ తన మిత్రుడు కావడం గర్వకారణమన్న టుస్క్

**ఢిల్లీ, అక్టోబర్ 23 :** భారత్, పోలండుల మధ్య విస్తృత రక్షణ బంధానికి బాటలు పడ్డాయి. అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లోనూ మరింతగా సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. దీంతోపాటు వాణిజ్యాన్ని ఇప్పుడున్న దానికి రెట్టింపు చేస్తూ 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిశ్చయించాయి. మన దేశంలో 3 రోజుల పర్యటనకు వచ్చిన పోలండ్ ప్రధాని డొనాల్ టుస్క్, ప్రధాని మోడీ మధ్య గురువారం ఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. అనంతరం రెండు దేశాలు కలిసి నాలుగు అంశాలపై ప్రకటన చేశాయి. ఇందులో వాణిజ్యం రెట్టింపు, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై చర్చలు, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం ఉన్నాయి.

ఉక్రెయిన్-రష్యా, పశ్చిమాసియాల్లో శాంతి సాధనకు జరిగే ఎటువంటి అర్థవంతమైన ప్రయత్నాలకైనా పూర్తి మద్దతిస్తామని ప్రధాని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భారత్, పోలండ్లు ప్రజాస్వామ్య విలువలను నమ్ముతాయని, చట్టాలను గౌరవిస్తాయని పేర్కొన్నారు. మరోవైపు మోడీపై టుస్క్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన తన స్నేహితుడని చెప్పుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. 'పోలండ్తో కలిసి రక్షణ, అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లో అభివృద్ధి, తయారీకి కృషి చేయాలని నిర్ణయించాం. కీలక ఖనిజాలు, బొగ్గు రంగాల్లోనూ సహకరించుకోవాలని అంగీకరించాం' అని మోడీ అన్నారు.

### బంగ్లాదేశ్ జైళ్లలోని విదేశీయుల్లో

# సగానికి పైగా భారతీయులే



**ఢాకా, అక్టోబర్ 23 :** బంగ్లాదేశ్ జైళ్లలోని విదేశీ ఖైదీలలో సగానికి పైగా భారతీయులే ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, బంగారం స్మగ్లింగ్ వంటి వివిధ నేరాలకు సంబంధించి 15 దేశాలకు చెందిన కనీసం 407 మంది విదేశీయులు ఇక్కడి జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నారు. వారిలో 238 భారతీయులు కాగా.. 168 మంది శిక్షాకాలం ఇప్పటికే పూర్తయ్యింది. వారిని స్వదేశానికి పంపే ఏర్పాట్లు ఇంకా పూర్తి కాకపోవడంతో నిర్బంధంలోనే ఉన్నారు. మిగిలిన వారిలో మయన్మార్, నైజీరియా, పాకిస్థాన్, మలేషియాలకు చెందిన వారు ఉన్నారు.

జైలు శిక్ష పూర్తి చేసుకున్న భారతీయ ఖైదీల జాబితాలను బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తమకు పంపిందని భారత హైకమిషన్ అధికారి తెలిపారు. వారు భారతీయులేనా కాదా అనే విషయాన్ని నిర్ధరించుకోవడంలో పలు సమస్యలు ఉండడంతో విడుదలలో జాప్యం చోటుచేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఆ ఖైదీలను కలిసి, మాట్లాడేందుకు అక్కడి అధికారుల అనుమతి కోరామన్నారు. బంగ్లా విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి స్పందన కోసం ఎదురుచూస్తున్నామని.. ఖైదీల జాతీయతను ధ్రువీకరించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

# కనిపించకుండా తిరిగే అరుదైన మంచు చిరుతలు

**థింపూ, అక్టోబర్ 23 :** మంచు పర్వతాల్లో కంటికి కనిపించకుండా సంచరించే అరుదైన మంచు



చిరుతల సంరక్షణలో భూటాన్ కీలక అడుగు వేసింది. ఎత్తయిన మంచు పర్వతాల్లో అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకుని జీవించే మంచు చిరుతలను 'ఘోస్ట్ ఆఫ్ ది మౌంటెయిన్స్' అని పిలుస్తారు. ఆ తరహా చిరుతల జీవనశైలిని పరిశీలించేందుకు వన్యప్రాణి సంరక్షణ సంస్థ బృందం ఏడాది క్రితం ఓ మంచు చిరుతకు జీపీఎస్ కాలర్‌ను అమర్చింది. ఆ కెమెరా ట్రాప్‌నకు చిక్కిన అత్యంత అరుదైన మంచు చిరుతల దృశ్యాలను తాజాగా విడుదల చేశారు.

# ఏఐ సాయం చేసినా.. ట్రిగ్గర్ నొక్కింది మనిషేగా

- ఇరాన్ పాఠశాల దాడిపై అమెరికా మాజీ అధికారి

**వాషింగ్టన్, అక్టోబర్ 23 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో మినాబ్‌లోని ఓ పాఠశాలపై జరిగిన దాడి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఆ బాంబు దాడిలో 123 మంది విద్యార్థులు సహా 156 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై అమెరికా సీఐఏ మాజీ డైరెక్టర్ డేవిడ్ పెట్రాయస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో లక్ష్యాలను గుర్తించేందుకు కృత్రిమ మేధ సహాయం తీసుకున్నప్పటికీ.. చివరిగా ట్రిగ్గర్ నొక్కింది మాత్రం మనిషేగా అన్నారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన వరల్డ్ సమ్మిట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు.

''అది ఒక మనిషి తీసుకున్న నిర్ణయం. అందులో మెషీన్ పాత్ర ఏమీలేదు. ఏఐని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. దాని సహాయం తీసుకున్నారు. ఈ క్రమంలో తప్పులు జరిగాయి. పశ్చిమాసియా ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధంలో ఇలాంటివి మీరు చూసుంటారు. ట్రిగ్గర్ లాగడమా, బటన్ నొక్కడమా.. ఇలా ఏదైనా అంతిమంగా దాడి చేయాలా..? వద్దా..? అని నిర్ణయించుకునేది మనిషే'' అని సీఐఏ మాజీ చీఫ్ పేర్కొన్నారు.

ఇరాన్‌తో యుద్ధానికి ముందు మిలటరీ లక్ష్యాలను ఎంపిక చేయడానికి ఏఐ కిల్‌చైన్‌పై అమెరికా సెంట్రల్ కమాండ్ ఆధారపడిందని, ఆ టూల్‌తో సేకరించిన సమాచారంతోనే పొరపాటున ఆ పాఠశాలను టార్గెట్‌గా గుర్తించారని గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

**ఇప్పటికీ కొన్ని మృతదేహాలు లభ్యం కాలేదు: ఇరాన్**

మినాబ్ స్కూల్ బాంబింగ్‌పై అమెరికా ఇప్పటికీ క్షమాపణ చెప్పలేదని ఇరాన్ దౌత్యవేత్త అయతుల్లా అబ్దుల్ మజీద్ హకీమ్ మండిపడ్డారు. ''ఫిబ్రవరి 28న వారు ఇరాన్‌పై దాడి చేశారు. ప్రాథమిక పాఠశాలను రెండుసార్లు లక్ష్యంగా చేసుకున్నారు. ఏ పాపం తెలియని పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ ఈ పిల్లల్లో కొందరి మృతదేహాలు లభ్యంకాలేదు. వారి గుర్తుగా ఒక సమాధి కూడా లేదు. ఆ పరిస్థితి వారి తల్లిదండ్రులను ఇంకా బాధిస్తోంది. ఇలా ఒక



పాఠశాలపై దాడి చేసినందుకు అమెరికా ఇప్పటికీ క్షమాపణలు చెప్పలేదు. అది చాలదన్నట్టు ఈ ఘటనపై విచారణ జరిపేందుకు ఐరాస ఒక దర్యాప్తు కమిటీని పంపింది'' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

**మొజ్తాబా ఎందుకు బయట కనిపించడం లేదంటే..?**

ఫిబ్రవరిలో అమెరికా- ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా గాయపడిన మొజ్తాబా ఖమేనీ.. ఆ తర్వాత నుంచి బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. దీనిపై దౌత్యవేత్త మాట్లాడారు. ''ఆయన ఆరోగ్యం బాగుంది. చురుగ్గా పనిచేస్తున్నారు. గతవారం అధ్యక్షుడితో ఏడు గంటలపాటు సమావేశమయ్యారు. మీడియా ముందుకు రాకపోవడంతో ఆయన ఎవరికీ కనిపించలేదు. కానీ ఆయన తనతండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో నేను ఇరాన్‌లోనే ఉన్నాను. మొజ్తాబా ఇద్దరు సోదరులను కలిశాను. అక్కడే మొజ్తాబా కూడా ఉన్నారు. ఆయన కొన్నిసార్లు రాత్రి సమయంలో బయటకు వస్తున్నారు'' అని చెప్పడం గమనార్హం.

### ఈజిప్టులో అపురూప దృశ్యం..

# రామెసెస్ విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు

**కైరో, అక్టోబర్ 23 :** ఈజిపులోని చారిత్రక ప్రదేశం అబు సింబెల్‌లో అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. ఫారో చక్రవర్తి రామెసెస్-2 (ఐఐ) విగ్రహంపై గురువారం ఉదయం సూర్య కిరణాలు నేరుగా ప్రసరించాయి. ఏడాదికి రెండు సార్లు మాత్రమే కనిపించే ఈ దృశ్యాన్ని వీక్షించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి వందలాది మంది పర్యాటకులు తరలివచ్చారు. రామెసెస్ జన్మదినం అక్టోబర్ 22, ఆయన సింహాసనాన్ని అధిష్ఠించిన ఫిబ్రవరి 22న మాత్రమే సూర్య కిరణాలు విగ్రహాన్ని తాకేలా ప్రాచీన ఈజిప్షియన్లు ఈ ఆలయాన్ని నిర్మించడం విశేషం.

# అమెరికాలో చేరే భారతీయ విద్యార్థుల సంఖ్యలో 39% క్షీణత

**వాషింగ్టన్, అక్టోబర్ 23 :** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. దీంతో ఆ దేశానికి వెళ్లాలనుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. గతేడాదితో పోలిస్తే ఆగస్టులో స్టూడెంట్ వీసాలపై భారతదేశం నుంచి యూఎస్‌కు వెళ్లిన విద్యార్థుల సంఖ్య 39 శాతం తగ్గింది. సాధారణంగా ఫాల్ సెమిస్టర్‌కు ముందు విదేశీ విద్యార్థుల చేరిక అత్యధికంగా ఉండే ఈ నెలలో.. వరుసగా వార్షిక క్షీణత నమోదు కావడం గమనార్హం.




ఆగస్టులో ఎఫ్, ఎం కేటగిరీ వీసాలపై అమెరికాకు వచ్చిన భారతీయ విద్యార్థుల సంఖ్య 25,321గా అమెరికా వాణిజ్య శాఖకు చెందిన అంతర్జాతీయ వాణిజ్య పరిపాలన వెల్లడించింది. గతేడాది ఈ కేటగిరీ వీసాలపై 41,540 మంది వెళ్లినట్లు నివేదికలు పేర్కొన్నాయి. కొవిడ్ మహమ్మారి కారణంగా 2020లో ప్రయాణ ఆంక్షలు విధించిన సమయంలో విద్యార్థుల సంఖ్య 2,908కు పరిమితం కాగా.. మళ్లీ ఆగస్టు నెలలో నమోదైన అత్యల్ప సంఖ్య ఇదేనని తెలిపాయి. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలోనూ విద్యార్థుల సంఖ్య కొంత మేర తగ్గినప్పటికీ.. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇది మరింత వేగంగా పడిపోయింది.

కఠినమైన వీసా నిబంధనలు, చదువు పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలపై అనిశ్చితి, సోషల్ మీడియా వెట్టింగ్ వంటి అంశాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అధిక వీసా తిరస్కరణ రేట్లు, ఉపాధి అవకాశాలు, పెరుగుతున్న విద్యావ్యయం వంటి అంశాలు కూడా భారతీయ విద్యార్థులను తమ ప్రణాళికలను పునఃపరిశీలించుకునేలా ప్రేరేపిస్తున్నాయని ఎడ్యువెలాసిటీ గ్లోబల్ మేనేజింగ్ పార్టనర్ కన్సల్టెంట్ పేర్కొన్నారు.




## వైయస్సార్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి !



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 23 (మనం న్యూస్ ):** స్థానిక ఎన్నికల్లో వైయస్సార్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వైయస్సార్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజవర్గ ఇన్చార్జి వడ్డీ రఘు రామ్ నాయుడు అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం, రూరల్ మండలం చినతాడేపల్లి ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కాసాని లలిత శారదా భ్రమరాంబ నామినేషన్ దాఖలు చేశారు.ఈ నామినేషన్ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు పాల్గొని అభ్యర్థికి అభినందనలు తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు , తాడేపల్లిగూడెం మండలంలో నామినేషన్లకు ఉత్సాహంగా వైయస్సార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యలమంచిలి జడ్పీటీసీ కూటమి అభ్యర్థిని కొడవటి నాగలక్ష్మి వరబాబు నామినేషన్ దాఖలు



**పాలకొల్లు, అక్టోబర్ 23,మనం ప్రతినిధి :** యలమంచిలి జడ్పీటీసీ కూటమి అభ్యర్థిని కొడవటి నాగలక్ష్మి వరబాబు భీమవరం జడ్పీ కార్యాలయం లో నామినేషన్ దాఖలు చేశారు.ఈ మేరకు వివరాలు స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా కొడవటి నాగలక్ష్మి వరబాబు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించి న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి రామానాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి పాటుపడండి



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 23 (మనం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజాభిమానం ఉన్న నాయకులను ప్రజాస్వామ్యబద్ధంగా ఏకగ్రీవంగా ఎంపిక చేసుకుని గ్రామాభివృద్ధికి పాటుపడాలని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కామన గణపతి ఆధ్వర్యంలో సుమారు 100 మంది కార్యకర్తలు శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో జనసేనలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కామన రామాంజనేయులు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి గూడెం సొసైటీ అధ్యక్షుడు సిద్ధా వీరరాజు, మాజీ సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ, కట్టా జానకిరామయ్య, నాయకులు దాసరి చిలకరాజు, తిరుపతి రావు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల విజయంతోనే పట్టణ అభివృద్ధి

- కొవ్వలి రామ్మోహన్ నాయుడు



**నరసాపురం, అక్టోబర్ 23 (మనం న్యూస్) :** నరసాపురం పట్టణం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థుల విజయం ఎంతో కీలకమని నవంబర్ 1న జరగనున్న మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించి నరసాపురం పట్టణ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 8వ వార్డులో ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థుల తరపున కొవ్వలి రామ్మోహన్ నాయుడు పాల్గొని జనసేన పార్టీ చైర్పర్సన్ అభ్యర్థి కొత్తపల్లి శైలజ, 8వ వార్డు తెదేపా కౌన్సిలర్ అభ్యర్థి కోటిపల్లి లక్ష్మిలతో కలిసి వార్డులోని ప్రతి గడపకూ వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలిశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల ను ప్రజలకు వివరించారు. రానున్న మునిసిపల్ ఎన్నికలలో సైకిల్ మరియు గాజు గ్లాసు గుర్తులకు ఓట్లు వేసి చైర్పర్సన్ అభ్యర్థి కొత్తపల్లి శైలజ, కౌన్సిలర్ అభ్యర్థి కోటిపల్లి లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, కొవ్వలి అభిమానులు పాల్గొన్నారు.

### మంత్రి నిమ్మల ఆశీస్సులు పొందిన

# కూటమి అభ్యర్థి దొంగ సూర్యప్రసాద్!

**పోడూరు మండల రాజకీయాల్లో అభ్యర్థి భేటీపై ఆసక్తి.**

**పాలకొల్లులోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన సూర్యప్రసాద్**



**పోడూరు, అక్టోబరు 23, మనం ప్రతినిధి :** స్థానిక సంస్థలు ఎన్నికల్లో భాగంగా మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆశీస్సులతో పోడూరు మండలం ఎంపీపీ అభ్యర్థిగా కూటమి అధిష్టానం ఎంపిక చేయడంతో పోడూరు గ్రామం 2 నుంచి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దొంగ సూర్య ప్రసాద్ శుక్రవారం పాలకొల్లులోని మంత్రి నిమ్మల రామానాయుడు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీస్సులు పొందారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. మండలంలో కూటమి తరపున ఎన్నికల బరిలో నిలిచిన సూర్యప్రసాద్ మంత్రి నిమ్మలను కలవడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పోడూరు మండలం అభివృద్ధికి రాజకీయంగా అనుభవజ్ఞుడైన దొంగ సూర్య ప్రసాద్ లాంటి వ్యక్తి అవసరం అని సరైన వ్యక్తిని ఎంపిపి గా ఎన్నుకోవడం జరిగిందని ఆయన గెలుపుకు కూటమి నాయకులు తెలుగుదేశం నాయకులు కలిసికట్టుగా పనిచేసి అఖండ విజయంతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు రుద్రరాజు రామభద్రరాజు, దాసరి రత్నరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, గణపతినీడి రాంబాబు, రుద్రరాజు రవిరాజు, రుద్రరాజు రమేష్ రాజు, జయరామకృష్ణ, కుక్కల మునీంద్ర, బొక్కా సూర్యనారాయణ, దొమ్మేటి పురుషోత్తం, బొంతు కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరంలోని మూడు ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు

- శంఖవరంలో ఎన్నికల అధికారి సమక్షంలో నామినేషన్ల దాఖలు
- ఎన్నికల నియమావళిని పాటించాలి.. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు అధికారుల చర్యలు




**అన్నవరం, అక్టోబర్ 23, మనం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాకినాడ జిల్లా శంఖవరం మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన మూడు ఎంపీటీసీ స్థానాలకు శుక్రవారం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మండల కేంద్రమైన శంఖవరంలో ఎన్నికల అధికారి, ఎంపీడీవో నాగేంద్ర సమక్షంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది.

**నామినేషన్ల పరిశీలన కీలకం**

నామినేషన్ల స్వీకరణ అనంతరం ఎన్నికల అధికారులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పత్రాలను పరిశీలిస్తారు. అభ్యర్థుల అర్హతలు, నామినేషన్ పత్రాల్లోని వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. నామినేషన్ల దాఖలుతో అన్నవర ంలోని మూడు ఎంపీటీసీ స్థానాల ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం ప్రారంభమైంది. తదుపరి దశల్లో నామి నేషన్ల పరిశీలన, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన అనంతరం ఎన్నికల పోటీపై స్పష్టత రానుంది.

## ఎన్నికల బరిలో దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం!

- పోడూరు ఎంపీటీసీ-1 స్థానానికి గుత్తుల లక్ష్మణ కుమార్ నామినేషన్
- రాజకీయాల్లోనూ నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్



**పోడూరు, అక్టోబరు 23 (మనం ప్రతినిధి) :** దివ్యాంగులు సమాజంలో అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందాల్సిన అవసరం ఉంది. విద్య, ఉపాధితో పాటు రాజకీయ రంగంలోనూ వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో పోడూరు దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో సంఘం తరపున పోడూరు ఎంపీటీసీ-1 స్థానం నుంచి గుత్తుల లక్ష్మణ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు.

**రాజకీయాల్లోనూ సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి**

దివ్యాంగులకు విద్య, ఉపాధితో పాటు రాజకీయ రంగంలోనూ నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలని పోడూరు దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం డిమాండ్ చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా దివ్యాంగులకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరింది. దివ్యాంగుల హక్కులను పరిరక్షిస్తూ అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మల్లుల సూర్యనారాయణ, కోశాధికారి బి. కుమారి, బి. శిరీష, జి. కళ్యాణి, గుబ్బల ప్రసాద్బాబు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్ అభ్యర్థిని కొత్తపల్లి శైలజ ముమ్మర ప్రచారం

- ప్రచారంలో పాల్గొన్న సుబ్బారాయుడు, జానకిరామ్



**నరసాపురం, అక్టోబర్ 23 (మనం న్యూస్) :** నవంబర్ 1న జరగనున్న మునిసిపల్ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి తరపున నరసాపురం పురపాలక సంఘానికి చైర్మన్ అభ్యర్థిగా జనసేన పార్టీ తరపన పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ సతీమణి కొత్తపల్లి శైలజ కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ప్రచారంలో దూసుకుపోతున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం నరసాపురం పట్టణంలోని పలు వార్డులలో చైర్మన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కొత్తపల్లి శైలజతో పాటు ఆమె కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, సుబ్బారాయుడు తనయుడు, మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి భుసంగరాయలు (నాని) కూటమి నాయకులతో కలిసి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసు కుంటూ ప్రచారం నిర్వహించారు. పట్టణంలో దీర్ఘకాలికంగా నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ప్రజలకు భరోసా ఇస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు, వీర మహిళలు, కొత్తపల్లి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉండి జడ్పిటిసి అభ్యర్థిగా పొత్తూరి నామినేషన్

**నరసాపురం, అక్టోబర్ 23 (మనం న్యూస్) :** ఉండి నియోజకవర్గంలోని ఉండి మండలం జడ్పీటీసీ అభ్యర్థిగా నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం భీమవరం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీకి ఉండి జడ్పిటిసి అభ్యర్థిగా పొత్తూరి రామరాజు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు




- బహుమతులు అంద జేసిన గాంధీ భగవాన్ రాజు

**పాలకొల్లు : అక్టోబర్ 23,మనం ప్రతినిధి:** సిహెచ్ బుద్ధ అవతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు గురువారంతో ముగిసాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గొట్టుముక్కల బున్ రాజు తెలిపారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవం లో ఈ టోర్నమెంట్లో పాల్గొన్న విజేతలకు టోర్నమెంట్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, టోర్నమెంట్ డైరెక్టర్ వివి సోమరాజు, అయిష్ట సెక్రటరీ అరిటాకుల రాంబాబు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అంపైర్లుగా వ్యవహరించిన వినుకొండ దినేష్, పి వరప్రసాద్ రాజు, రిఫరీ గా వ్యవహరించిన గజేంద్ర నాయుడు, సినీ హాస్య నటుడు సారిక రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### తాడేపల్లిగూడెం ఎక్సైజ్ పరిధిలో

## పాత నేరస్తులు బైండోవర్



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 23 (మనం న్యూస్) :** తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసుల్లో పట్టుబడిన 5 మంది పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆఫీసర్ స్వరాజ్య లక్ష్మి తెలిపారు.తాడేపల్లిగూడెం మండలానికి చెందిన ఈ 5 మంది పాత నేరస్తులను గురువారం స్థానిక మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, ఏడాది పాటు సత్ప్రవర్తనతో ఉండేలా రూ.1,50,000 విలువైన బాండ్ పై బైండోవర్ చేశామని ఆమె తెలిపారు.ఈ ఏడాది కాలంలో వారు సత్ప్రవర్తనతో ఉండకుండా ఏదైనా నేరానికి పాల్పడితే, బాండ్ ప్రకారం పెనాల్టీ విధించి ప్రభుత్వ ఖజానాకు డబ్బులు కట్టించడమే కాకుండా చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా మద్యం రవాణా చేసినా, బెల్ట్ షాపులు నిర్వహించినా తమ దృష్టికి తీసుకురావాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### కుక్కునూరు జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన తరపున

## యర్ణం సరోజినీ నామినేషన్ దాఖలు



**కుక్కునూరు, అక్టోబర్ 23 ( మనం న్యూస్ ):** జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ తరపున యర్ణం సరోజినీ శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం లో నామినేషన్ దాఖలు చేశారు. జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ, బి జె పి పార్టీలు బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిగా ఆమె బరిలో నిలిచారు.

నామినేషన్ దాఖలు కార్యక్రమంతో కుక్కునూరు జనసేన పార్టీ తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా యర్ణం సరోజినీ ఎన్నికల బరిలో నిలవడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం ఆయన అడుగులు వేస్తున్నారు. స్థానికంగా కూడా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జనసేన కావడంతో గ్రామాల అభివృద్ధి , కనీస మౌలిక సదుపాయాలు వంటివి యర్ణం సరోజిని గెలిస్తే మండల అభివృద్ధి జరుగుతుంది అని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### జీవీఎంసీ ఎన్నికల నిర్వహణకు

## పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

**ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలి**

**పోస్టల్ బ్యాలెట్, శిక్షణ, కౌంటింగ్ ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్**



**విశాఖపట్నం, అక్టోబర్ 23:** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం జీవీఎంసీ సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్తో కలిసి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్, సెక్టోరల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఫోటో ఓటర్ స్లిప్పులను నిర్ణీత సమయంలో ఓటర్లకు పంపిణీ చేయాలని, కొత్త అనుబంధ ఓటర్ల జాబితా విడుదలైతే వాటిని కూడా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థుల తుది జాబితా ప్రచురించిన వెంటనే బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ఇతర ఎన్నికల ప్రక్రియలను వేగంగా చేపట్టేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో రెండో విడత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే అధికారులు, సిబ్బందికి రవాణా, వినియోగానికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు.

## ప్రతిపక్షాలను నిర్బంధించి ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్యమా.!

- రెండు రోజులుగా గృహ నిర్బంధం
- మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



**తుని, అక్టోబర్ 23, మనం న్యూస్ :** ప్రతిపక్షాలను నిర్బంధిస్తూ, నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా విమర్శించారు. తుని ఎస్ అన్నవరం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజా మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా తనకు కొన్ని బాధ్యతలు ఉన్నాయని, అయితే గత రెండు రోజులుగా పోలీసులు తనను గృహ నిర్బంధం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రతి నిమిషం విలువైనదని, ఇలాంటి పరిస్థితులు సృష్టించడం రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మం కాదని అన్నారు. రెండు రోజుల క్రితం తొండంగి ఎంపీడీవో కార్యాలయానికి తన ప్యానెల్కు చెందిన 25 మంది సభ్యులు నామినేషన్లు వేసేందుకు వెళ్లగా, వారి నుంచి నామినేషన్ పత్రాలు లాక్కున్నారని రాజా ఆరోపించారు. పైడికొండ గ్రామంలోనూ యువకులను అడ్డగించి నామినేషన్ పత్రాలు లాక్కున్నట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకుని తాను అక్కడికి చేరుకుని యువకులకు ధైర్యం చెప్పి నామినేషన్లు వేసేందుకు తీసుకువెళ్లానని చెప్పారు. అయితే సుమారు 1,500 మంది పోలీసులు తమను అడ్డగించి, నాలుగున్నర గంటల పాటు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.

## జిల్లా కలెక్టర్ పేరుతో నకిలీ వాట్సాప్ ఖాతా

- అధికారులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ పేషీ హెచ్చరిక

**విశాఖపట్నం, అక్టోబర్ 23:** విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ పేరు, గుర్తింపుతో గుర్తుతెలియని వ్యక్తి నకిలీ వాట్సాప్ ఖాతాను సృష్టించి, పలువురికి సందేశాలు పంపిస్తూ డబ్బులు కోరుతున్నట్లు కలెక్టర్ పేషీ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేషీ ఒక ప్రకటనలో హెచ్చరించింది. కలెక్టర్ పేరుతో డబ్బులు కోరుతూ వచ్చే అనుమానాస్పద వాట్సాప్ సందేశాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి సున్నితమైన సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు బదిలీ చేయవద్దని స్పష్టం చేసింది. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండేలా చూడాలని కలెక్టర్ పేషీ కోరింది.

## ఓట్ల కోసం కూటమి నాయకుల ప్రచారం జోరు



**పెంటపాడు, అక్టోబర్ 23 ( మనం న్యూస్ ):** పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో పరిషత్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లి మద్దతు కూడగట్టే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.జడ్పీటీసీ అభ్యర్థి తనబుద్ధి రవికిరణ్, ఎంపీపీ అభ్యర్థి రామలక్ష్మి తరపున ఆమె భర్త పుల్లా బాబీ, ఎంపీటీసీ-1 అభ్యర్థి ఆంజనేయులు కలిసి ప్రచారాన్ని ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి తనబుద్ధి రవికిరణ్ మాట్లాడుతూ 'ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఎన్నికల బరిలోకి వచ్చాం. మాకు ఒక అవకాశం కల్పిస్తే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తాం. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటాం' అని పేర్కొన్నారు.ఎంపీపీ అభ్యర్థి రామలక్ష్మి తరపున ఆమె భర్త పుల్లా బాబీ మాట్లాడుతూ 'ప్రజల ఆదరణే మా బలం. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం. ప్రజలు మాపై నమ్మకంతో అవకాశం ఇస్తే వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం' అని అన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో సీనియర్ రాజకీయ నాయకుడు తనబుద్ధి భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి

## మంత్రి టీజీ భరత్

**కర్నూలుఅక్టోబర్ 23 మనం న్యూస్ :** నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు నగరంలోని 12, 13, 14వ వార్డుల్లో శుక్రవారం మంత్రి టీజీ భరత్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. ఆయా వార్డుల్లో పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తూ, వారికి కేటాయించిన గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. కర్నూలు నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయాలు కల్పించడంతో పాటు నగరంలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరంలో అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగాలంటే ప్రజలు కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేసే అభ్యర్థులను గెలిపించడం ద్వారా వార్డుల అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. మాటిచ్చిన విధంగా యువతకు ఉద్యోగాల కల్పన కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. 12వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి బి. నవీన్ కుమార్, 13వ వార్డు బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి ఎస్. మహేశ్వరి, 14వ వార్డు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి షేక్ షబ్బీర్లతో పాటు మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూష ను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి ప్రజలను కోరారు.





## వాహనాలు తనిఖీ

**మంత్రాలయం , అక్టోబర్ 23,మనం న్యూస్:** మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఉన్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు దగ్గర మాధవరం ఎస్ఐ విజయకుమార్ శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక మద్యం, ఇతర (ఓటర్లను ఆకర్షించడానికి ఇచ్చే) వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా చెక్ పోస్టు దగ్గర వాహనాలు తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు.

# అపరిశుభ్రతను సహించం

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

## అపరిశుభ్రంగా ఉంచిన రెండు దుకాణాలకు జరిమానా



**కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్):** నగరంలోని జనావాస, వాణిజ్య ప్రాంతాల్లో అపరిశుభ్రతను సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన బుధవారపేట, మద్దూర్ నగర్, సి.క్యాంపు, ఐ.టి.సి., ముజఫర్ నగర్, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, అలాగే సి.క్యాంపు సెంటర్ వద్ద అపరిశుభ్రంగా ఉంచిన రెండు వేర్వేరు దుకాణాలకు జరిమానా విధించాలని ఆదేశించారు. అదేవిధంగా సెట్కూరు కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్ను, గోవర్ధన్ నగర్ రైతు బజార్ను తనిఖీ చేసి, అక్కడి పరిశుభ్రతను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం నగరపాలక సంస్థ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, వాణిజ్య దుకాణదారులకు కూడా సమాన బాధ్యత ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా చెత్తబుట్ట ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నప్పటికీ కొందరిలో మార్పు రాకపోవడం బాధాకరమన్నారు. పారిశుద్ధ్య నిబంధనలు పాటించని వారిపై జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇన్స్పెక్టర్లు ఫరూక్, హుస్సేన్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ సభ్యులుగా నామినేషన్ వేసిన అభ్యర్థులు



**బేతంచేర్ల అక్టోబర్ 23 (మనం న్యూస్):** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడో రోజు ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ బషీరున్నిసా బేగం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఫజ్జుల్ రెహ్మాన్ తెలిపిన వివరాలను మనకు మండలంలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ సభ్యుల గ్రామాల పార్టీల అభ్యర్థులు అంబాపురం వైయస్సార్సీపి అభ్యర్థి సిమెంట్ నగర్ వైఎస్ఆర్సిపి 2 సిమెంట్ నగర్ టిడిపి యంబాయి టిడిపి 2 యంబాయి టిడిపి గోరుమానుకోండ వైయస్సార్ సిపి గూటి పల్లె టిడిపి హెచ్ కొటాల టిడిపి కోలుములపల్లె టిడిపి ఎం పెండకల్ టిడిపి ఎం పెండకల్ జనసేన ముద్దవరం వైయస్సార్ సిపి ఆర్ కొత్తపల్లి టిడిపి ఆర్ఎస్ రంగాపురం టిడిపి 2 ఆర్ఎస్ రంగాపురం వైఎస్ఆర్సిపి 2 ఆర్ఎస్ రంగాపురం జనసేన సీతారామపురం టిడిపి అభ్యర్థులు నామినేషన్ వేశారని తెలిపారు.

## కాట్రేనికోన చిత్రకారునికి ముంబైలో ప్రశంసలు



**కాట్రేనికోన అక్టోబర్ 23 మనం ప్రతినిధి :** కాట్రేనికోన గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు అంజి ఆకొండి గీసిన 3 చిత్రాలను ముంబై మహానగరంలో పిఎల్ దేశ్ పాండే మహారాష్ట్ర కళా అకాడమీలో జరుగుతున్న ఇండియా ఆర్ట్ మీట్ లో మూడురోజులు పాటు ప్రదర్శనకు ఉంచడం జరిగింది. ఈ చిత్రకళ ప్రదర్శనని జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హిం చటర్జీ మరియు ప్రముఖ ఆర్ట్ క్యూరేటర్ మనీష్ బాహతి, ఆర్కా ప్రధాన్ లు పాల్గొని అంజి గీసిన చిత్రాలను శుక్రవారం చూసి ప్రశంసిస్తూ అభినందనలు తెలియజేశారని అంజి తెలిపారు.

# సీవోసీ కేంద్రం పనితీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్

## పోలింగ్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి



**విశాఖపట్నం, అక్టోబర్ 23:** జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు-2026 నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన సిటీ ఆపరేషన్స్ సెంటర్ (సీవోసీ)లో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్, అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల నుంచి సమాచారం సేకరణ, వెబ్కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ, ఫిర్యాదుల స్వీకరణ, వాటిపై తీసుకునే చర్యల గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించాలని, ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి సకాలంలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని సేకరించి, క్రోడీకరించి నివేదికలు రూపొందించాలని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి నిర్ణీత సమయాల్లో కచ్చితమైన సమాచారం అందేలా ఎన్నికల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అలాగే, ఎన్నికలకు సంబంధించిన సోషల్ మీడియా పోస్టులు, ఫిర్యాదులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై నిరంతర నిఘా ఉంచాలని, అభ్యంతరకరమైన పోస్టులు లేదా నిబంధనలకు విరుద్ధమైన ప్రచారం గుర్తించినప్పుడు నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, జాయింట్ డైరెక్టర్ డి.విజయభారతి, మేయర్ రిటర్నింగ్ అధికారి బి. దయానిధి తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

## నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ డా. ఏ. సిరి



**గూడూరు , అక్టోబర్ 23 (మనం న్యూస్):** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెల్దుర్తి, కృష్ణగిరి, కోడుమూరు, గూడూరు మండల కేంద్రాల్లోని నామినేషన్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ పత్రాలు, డిపాజిట్ రసీదులు, ధ్రువపత్రాలు, అభ్యర్థుల అర్హతలు, ఆన్లైన్ నమోదును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా, నిబంధనల ప్రకారం ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కోడుమూరులో మీడియాతో మాట్లాడుతూ, చివరి రోజు నామినేషన్ల స్వీకరణకు అదనపు సిబ్బంది, వెరిఫికేషన్ టేబుళ్లను ఏర్పాటు చేసి ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ

- బ్లాక్ డెమాన్స్ట్రేషన్ పథకం కింద విత్తనాల పంపిణీ



**గూడూరు, అక్టోబర్ 23 (మనం న్యూస్):** గూడూరు మండలంలోని గూడూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎం. దస్తగిరి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. బ్లాక్ డెమాన్స్ట్రేషన్ పథకం కింద మండలంలోని రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మెరుగైన సాగు పద్ధతులను పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీఈవోలు శ్రావణి, నాగేష్, రంగన్నతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# చెప్పాం! చేస్తున్నాం!!' ప్రచార పోస్టర్ ఆవిష్కరణ



**గూడూరు , అక్టోబర్ 23:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందని కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 19 నుంచి 27 వరకు నిర్వహిస్తున్న 'చెప్పాం! చేస్తున్నాం!!' ప్రచార కార్యక్రమ పోస్టర్ను కర్నూలు కార్పొరేషన్ టీడీపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు ఆవిష్కరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారం, మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

## మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలోకి చేరికలు



**కర్నూలుఅక్టోబర్ 23మనం న్యూస్ :** కర్నూలు నగరంలోని 68వ వార్డుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఈశ్వరయ్య మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే బిర్లాగడ్డ ప్రాంతానికి చెందిన సాయి ఆధ్వర్యంలో యువకులు మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, పార్టీలో చేరిన నాయకులు, యువకులు టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో కర్నూలు ఎంతో అభివృద్ధి అవుతోందన్నారు. టీడీపీతోనే కలిసి నడుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పార్టీలో చేరిన నాయకులు, యువకులు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఖలీల్, శ్రీకాంత్, వెంకటేష్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి రాజశేఖర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# మరో 8 నెలలు ఎండల తీవ్రత

- తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఉంటాయ్
- విద్యుత్ వినియోగంపై స్వీయ నియంత్రణ పాటించాలె
- ఎల్నినో ప్రభావంపై సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం



**హైదరాబాద్, అక్టోబర్ 23(మనం బ్యూరో):** "మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ప్రజల భాగస్వామ్యం లేకుండా కరవును ఎదుర్కోలేము. కరోనా సమయంలో కేసీఆర్ ఇష్టమొచ్చినట్టు మాట్లాడారు. ఎండలకు కరోనా చచ్చిపోతుందని ఆనాడు కేసీఆర్ చెప్పారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు అని రాజకీయ దురుద్దేశంతో బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని' సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 100కు పైగా దేశాలపై ఎల్నినో ప్రభావం ఉంది. మహారాష్ట్ర లాంటి అభివృద్ధి చెందిన రాష్ట్రంలోనూ నీటి ఎద్దడి ఉంది. ఆ రాష్ట్రంలో 20శాతం తక్కువ నీటిని వాడాలని నిర్ణయించారు. మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఎండల తీవ్రతకు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. శనివారం ప్రజా భవన్లో టీపీసీసీ ఆధ్వర్యంలో పార్టీ ఎంఎల్ ఏ లు,ఎంఎల్సీ లు,ఎంపీలు,డీసీసీ అధ్యక్షులు,ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు కరవును ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కరవు, విపత్తులను మనం నిలువరించలేము. కరవుపై 6 నెలల నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. 3 నెలల క్రితం ఎల్నినో ప్రభావం పెద్దగా లేదు. ఏదోలా వానాకాలం పంటల నుంచి బయటపడ్డామని వ్యాఖ్యానించారు. రాజకీయ దురుద్దేశంతో కూడిన ప్రకటనలను కొందరు చేస్తున్నారు. మామ, అల్లుళ్లు మాత్రమే మేధావులా? బ్రిటన్ లాంటి దేశంలో కూడా ఎల్నినో వల్ల కరువును ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్థాయిలో కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడితే ప్రజలు నమ్మారని విమర్శించారు. ప్రాజెక్టుల్లో నీరు చాలా తక్కువగా ఉంది.. తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఉంటాయి.. ఈ సమస్యను దాచి పెట్టడం క్యాన్సర్ ను దాచి పెట్టడం వంటిదని పేర్కొన్నారు. పశు సంపదను కాపాడుకోవాలి.. వాటికి అవసరమైన పశు గ్రాసం, నీటి వసతులు కల్పించాలి. హైదరాబాద్ తో పాటు నగరాలు, గ్రామాల్లో తాగు నీరు సమస్య రాకుండా చూడాలని సూచించారు. తాగు నీటి సమస్యపై టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ఆ నంబర్ కి వచ్చే సమస్యలు వెంటనే పరిష్కరించాలనీ, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది.. సాధ్యమైనంత మేరకు స్వీయ నియంత్రణ పాటించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# పారా ఆసియా క్రీడల్లో భారత్‌కు రికార్డు స్థాయి పతకాలు

పారా ఆసియా క్రీడల్లో భారత్ పోరాటం ముగిసింది. ఈ మెగా ఈవెంట్లో భారత్ అథ్లెట్లు రికార్డు స్థాయిలో 114 పతకాలను కైవసం చేసుకున్నారు. 30 బంగారు పతకాలు, 35 రజతం, 49 కాంస్య పతకాలతో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. చైనా వేదికగా జరిగిన 2022 పారా ఆసియా క్రీడల కంటే ఈసారి 6 పతకాలు ఎక్కువగా వచ్చాయి. పారా ఆసియా క్రీడల చరిత్రలో భారత్కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 97 పతకాలతో రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఐదో స్థానంలో ఉంది. చివరి రోజైన శనివారం (అక్టోబరు 24) జరిగే ఈవెంట్స్లో ఆ దేశం పతకాలు సాధిస్తే.. పతకాల



పట్టికలో భారత్ కొంచెం దిగువకు వచ్చే అవకాశాలున్నాయి. ఈ క్రీడల్లో ఇప్పటివరకు 427 పతకాలతో చైనా ప్రథమస్థానంలో నిలవగా.. జపాన్ (185), ఉజ్బెకిస్థాన్ (145) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. చివరి రోజు భారత్ పారా షూటర్ మోనా అగర్వాల్ 50 మీటర్ల రైఫిల్ విభాగంలో బంగారు పతకం సాధించింది. చైనాకు చెందిన క్యాపింగ్ జాంగ్ 3.8 పాయింట్ల తేడాతో విజయం సాధించి మొదటి స్థానం దక్కించుకుంది. తాజా క్రీడల్లో మోనా అగర్వాల్కు ఇది రెండో బంగారు పతకం. టీ64 పురుషుల 400 మీ. పరుగు పందెంలో సందీప్ స్వర్ణం సాధించాడు. కేవలం 52.28 సెకన్లలో రేసును పూర్తి చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇదే ఈవెంట్లో మూడో స్థానం సాధించిన మరో భారత అథ్లెట్ అజయ్ కుమార్ (53.61 సెకన్లు) రికార్డు నమోదు చేశాడు. జావెలిన్ త్రోలోనూ భారత అథ్లెట్ హనీ వరల్ రికార్డు సాధించాడు. ఎఫ్37 విభాగంలో చరిత్ర సృష్టించాడు. ఐదో త్రోలోనే 59.72 మీ. విసిరి ప్రపంచ రికార్డు నమోదు చేసిన అతడు.. కాసేపటికే తన చివరి ఛాన్స్లో 60.49 మీ. విసిరి తన రికార్డును తానే బద్దలు కొట్టాడు.



ప్రతీకా సూపర్ సెంచరీ

# జింబాబ్వేపై భారత్ ఘన విజయం



వడోదర వేదికగా జింబాబ్వేతో జరిగిన తొలి వన్డేలో 9 వికెట్ల తేడాతో భారత మహిళల జట్టు ఘన విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 49.5 ఓవర్లలో కేవలం 197 పరుగులకే కుప్పకూలింది. జింబాబ్వే బ్యాటర్లలో బీలవ్డ్ బీజా 62 పరుగులతో టాప్ స్కోరర్గా నిలవగా.. మిచెల్ మావుంగా(29), ముపాచిక్వా(25) రాణించారు. భారత బౌలర్లలో శ్రీచరణి నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించింది. ఆమెతో పాటు క్రాంతి గౌడ్ మూడు, దీప్తి శర్మ రెండు వికెట్లు పడగొట్టారు.

**ప్రతీకా, షఫాలీ వర్మ మెరుపులు**

అనంతరం 198 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఊదిపడేసింది. ఓపెనర్ ప్రతీకా రావల్ (96 బంతుల్లో 15 ఫోర్లతో 100) అజేయ సెంచరీతో కదం తొక్కగా.. షఫాలీ వర్మ(33 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సతో 64) అర్ధ శతకంతో మెరిసింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే అక్టోబర్ 25న ఇదే వేదికలో జరగనుంది.



# నమన్ ధీర్.. జట్టుకు ఆశాకిరణం: సంజు శాంసన్

న్యూజిలాండ్ పేస్ బౌలింగ్ ను ఎదుర్కొని భారీ లక్ష్యాన్ని ఛేదించిన టీమ్ఇండియా ఐదు టీ20ల సిరీస్ ను ఘనంగా ప్రారంభించింది. ఓపెనర్ సంజు శాంసన్ (67) మొదట్లో అదరగొట్టగా.. కీలక సమయంలో నమన్ ధీర్ (42*:15 బంతుల్లో) చివరి వరకూ పోరాడి జట్టును గెలిపించాడు. ఇప్పటి వరకు కేవలం ఆరు టీ20లు మాత్రమే ఆడిన నమన్ స్ట్రైక్ రేట్ 285+ కావడం గమనార్హం.

''కివీస్ పై తొలి విజయంలో నమన్ కే ఎక్కువ క్రెడిట్ ఇవ్వాలి. అంతర్జాతీయంగా అతి తక్కువ మ్యాచులు ఆడినా.. కీలక సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కాలేదు. కివీస్ బౌలింగ్ ఎటాక్ ను అడ్డుకొని భారత్ కు చక్కటి విజయం అందించాడు. రాబోయే కాలంలో టీమ్ఇండియాకు ఆశాకిరణంగా మారతాడనడంలో ఎలాంటి సందేహం లేదు'' అని సంజు ప్రశంసించాడు.

**అతడి వల్ల మరిన్ని ఆప్షన్లు లభించాయి: శ్రేయస్**

''నమన్ ధీర్ పరుగులు చేయడం వల్ల మాకు ఆటగాళ్ల ఎంపికలో మరిన్ని ఆప్షన్లు వచ్చాయి. అతడు బౌలింగ్ కూడా చేయగలడు. కనీసం రెండు ఓవర్లు వేసినా జట్టుకు ఉపయోగమే. ప్రశాంతంగా ఉంటూ సహజంగా ఆడే నమన్ ధీర్ నుంచి అద్భుతమైన ప్రదర్శన చూశాం'' అని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు.

# 'జార్జ్ క్రిష్'నుంచి అదిరిపోయే అప్డేట్ ఇచ్చిన దర్శకుడు

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్, మాస్ ఎంటర్టైనర్ల దర్శకుడు శ్రీను వైట్ల కాంబోలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జార్జ్ క్రిష్'. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ ప్రసిద్ధ నిర్మాత రామబ్రహ్మం సుంకర అత్యంత భారీ బడ్జెట్తో నిర్మిస్తున్నారు. ఇక ఇటీవల 'కపుల్



ఫ్రెండ్లీ' సినిమాతో మంచి బ్లాక్బస్టర్ హిట్ అందుకని మెప్పించిన యంగ్ అండ్ బ్యూటీ మానస వారణాసి ఈ సినిమాలో శర్వానంద్ సరసన హీరోయిన్గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో.. తాజాగా, దర్శకుడు శ్రీను వైట్ల సోషల్ మీడియా వేదికగా అభిమానులకు ఒక క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా కోసం ఒక అదిరిపోయే 'రెట్రో మాస్' సాంగ్ రెడీ అవుతోందని, దీని బీట్స్ థియేటర్లలో పూర్తిస్థాయిలో సెగలు పుట్టిస్తాయని ఆయన తెలిపారు. మాస్ ప్రేక్షకులకు ఈ పాట పక్కా పండగలా ఉండబోతోందని చెప్పుకొచ్చిన శ్రీను వైట్ల.. ఈ సంక్రాంతికి థియేటర్లలో ఫుల్ లెంగ్త్ కామెడీ అండ్ యాక్షన్ వినోదాన్ని ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండమంటూ ఫ్యాన్స్లో జోష్ నింపారు. ప్రస్తుతం ఈ పోస్ట్తో 'జార్జ్ క్రిష్'పై అంచనాలు రెట్టింపు అయ్యాయి.

# ఒళ్లు చూపించే డ్రెస్సులు వేసుకోమంటే ఊరుకునేది లేదు.. రష్మిక

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు వరుస సినిమాలతో దూసుకుపోతూ నేషనల్ క్రష్ గా గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ రష్మిక మందన్న తాజాగా, ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. గ్లామర్ ఇండస్ట్రీలో ఎంత పేరు ప్రఖ్యాతలు ఉన్నప్పటికీ, తనకంటూ కొన్ని హద్దులు ఉంటాయని, వాటిని దాటి గ్లామర్ షో చేయడానికి తాను ఎప్పుడూ ఒప్పుకోనని తేల్చి చెప్పేసింది.



కొన్నిసార్లు కథ డిమాండ్ మేరకు లేదా పాత్ర కోసం బికినీ లాంటి మోడ్రన్ దుస్తులు వేసుకోవాల్సిన అవసరం రావొచ్చని.. కానీ అటువంటి సందర్భాల్లో కూడా మరీ ఎక్కువగా ఒళ్లు కనిపించేలా డ్రెస్సులు ధరించడం తనకు అస్సలు ఇష్టం ఉండదని ఆమె స్పష్టం చేశారు. తాను అలాంటి మనస్తత్వం ఉన్న అమ్మాయిని కాదని, ఏ సినిమా మొదలయ్యే ముందే ఈ విషయాలన్నీ డైరెక్టర్కి, చిత్ర బృందానికి చాలా స్పష్టంగా చెప్పేస్తానని క్లారిటీ ఇచ్చింది.

కొన్నిసార్లు కమర్షియల్ సినిమాల్లో కొన్ని ప్రత్యేక పాటల కోసం లేదా సన్నివేశాల కోసం తనకు పూర్తిగా సౌకర్యవంతంగా లేని బట్టలు వేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతుంటాయని తెలిపారు. కానీ అలాంటి వాటికి తాను దూరంగా ఉంటానని, తన పరిమితులు ఏమిటో ముందే మేకర్స్ కి ముఖం మీదే చెప్పేస్తానని వివరించింది. నటీనటుల సౌకర్యాన్ని, వాళ్ళ వ్యక్తిగత నిర్ణయాలను గౌరవించే దర్శకులు, నిర్మాతలతో మాత్రమే పనిచేయడానికి తాను ఇష్టపడతానని.. అలా కాదని గ్లామర్ దుస్తులు ధరించమంటే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు . ఎవరి ఒత్తిడికీ తలవంచకుండా తనకంటూ ఒక స్టైల్ మెయింటైన్ చేస్తున్న రష్మిక వ్యాఖ్యలను ఆమె అభిమానులు తెగ మెచ్చుకుంటున్నారు.



# ప్రభాస్‌తో వర్కింగ్ అనుభవంపై చైత్ర అచార్ ఆసక్తికర కామెంట్స్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ హను రాఘవపూడి కాంబోలో తెరకెక్కుతున్న భారీ పిరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఇమాన్వి హీరోయిన్ గా నటిస్తుండగా.. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే ఈ క్రేజీ ప్రాజెక్ట్ లో '418' ఫేమ్ కన్నడ బ్యూటీ చైత్ర అచార్ కూడా ఓ వైవిధ్యమైన పాత్రలో నటిస్తోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఈ సినిమా విశేషాలతో పాటు ప్రభాస్ తో పనిచేసిన అనుభవాన్ని ఆమె పంచుకున్నారు. డైరెక్టర్ హను రాఘవపూడి తనకు ఫోన్ చేసి 'ఫౌజీ' గురించి చెప్పిన క్షణాలను చైత్ర గుర్తుచేసుకున్నారు. తనను ఎందుకు పిలిచారో మొదట్లో అర్థం కాలేదని, కానీ నా క్యారెక్టర్ నెరేషన్ విన్నాక ఫిదా అయిపోయానని ఆమె తెలిపారు.



శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టపడే ఇలాంటి రోల్ లో నటించాలని ఎప్పుడో కలలు కన్నానని, వందలాది మందితో కూడిన ఇంతటి భారీ కమర్షియల్ సెట్ లో పనిచేయడం తనకు ఇదే మొదటిసారంటూ చెప్పుకొచ్చారు. ఇక డార్లింగ్ ప్రభాస్ గురించి చెబుతూ.. ఆయన చాలా మంచివారని, ముద్దులొలికే అమాయకత్వం ఆయన సొంతమని, అందుకే అందరూ ఆయన్ని డార్లింగ్ అంటారని అన్నారు. ఆయనకు తినడం ఇష్టమని, తోటివారికి ప్రేమగా తినిపించడం అంతకంటే ఇష్టమని తెలిపారు. అంతేకాకుండా, ప్రభాస్ తనను ఎంతగానో ప్రోత్సహించారని చెబుతూ.. తాను నటించకపోయినా తన సీన్స్ ఫుటేజ్ చూసి, నీ యాక్టింగ్కి థియేటర్లలో విజిల్స్ పడతాయని అప్రిషియేట్ చేశారని చెప్పుకొచ్చారు.



# బ్రిటీషర్లపై తిరుగుబాటు..

## ప్రభాస్ బర్త్డే స్పెషల్ సాలిడ్ ట్రీట్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' నుండి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న బర్త్డే స్పెషల్ గ్లింప్స్ను మేకర్స్ విడుదల చేశారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రెండో ప్రపంచ యుద్ధం, స్వాతంత్ర్య పూర్వ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం గ్లింప్స్ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. బ్రిటీష్ పాలన నుండి భారత్ను విముక్తి చేయడానికి సుభాష్ చంద్రబోస్, హిట్లర్ను కలిసే సన్నివేశంతో ఈ వీడియో ప్రారంభమవుతుంది. బ్రిటీష్ నిఘా వ్యవస్థను దెబ్బతీసిన ఒక వీరుడి సాయం తన వద్ద ఉందని బోస్ చెప్పడం, భగవద్గీత ఆధారంగా బలమైన కోడ్ను రూపొందించిన సైనికుడు, స్ట్రాటజిస్ట్ మరియు స్పై గా ప్రభాస్ పాత్రను పరిచయం చేయడం గ్లింప్స్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. భారీ మెషిన్ గన్తో ప్రభాస్ ఇచ్చిన ఎంట్రీ, ఆయన చెప్పిన హిందీ డైలాగ్స్ అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాయి. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బడ్జెట్తో నిర్మిస్తుండగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతాన్ని సమకూరుస్తున్నాడు. ఈ సినిమాలో ఇమాన్వి హీరోయిన్గా నటిస్తుండగా, అనుపమ్ ఖేర్, జయప్రద, మిథున్ చక్రవర్తి, చైత్ర జె ఆచార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని మార్చి 19, 2027న థియేటర్లలో గ్రాండ్గా విడుదల చేయడానికి చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది.

# 'ఇడుపు కాయితం'.. రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

టాలీవుడ్ లో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న టాలెంటెడ్ హీరో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఇడుపు కాయితం'. తెలంగాణ పల్లెటూరి ఫ్యామిలీ బ్యాక్డ్రాప్ స్టోరీతో అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైనింగ్ డ్రామాగా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో యూట్యూబ్ సెన్సేషన్ గా పేరు తెచ్చుకున్న నాగదుర్గ హీరోయిన్ గా టాలీవుడ్ కు పరిచయం అవుతోంది. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా.. ఇందులో శివజ్యోతి, సుజాత, చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్, మైమ్ మధు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. షూటింగ్ కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్లో క్రేజీ కాంబినేషన్గా పేరున్న జీనియస్ డైరెక్టర్ సుకుమార్ రైటింగ్స్, యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాయి.



ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి మ్యూజికల్ జర్నీ మొదలుపెట్టిన మేకర్స్.. మొదట ఓ పాటను లాంచ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆ తర్వాత 'గడప' పేరుతో విడుదల చేసిన రెండో పాట ప్రస్తుతం నెట్టింట తెగ ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ నేపథ్యంలో, తాజాగా నిర్మాత బన్నీ వాస్ ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించి బిగ్ అనౌన్స్మెంట్ ఇచ్చారు. 'రెండు ఆత్మల ప్రయాణం, ఎన్నో కుటుంబ అనుభూతులు, జీవితకాలపు మధుర జ్ఞాపకాలు' అంటూ హృదయాలను హత్తుకునే క్యాప్షన్ తో పాటు సినిమా రిలీజ్ డేట్ను ప్రకటించారు. 'ఇడుపు కాయితం' చిత్రాన్ని డిసెంబర్ 11, 2026న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. మీ కుటుంబంతో కలిసి థియేటర్లలో ఆస్వాదించదగ్గ అద్భుతమైన చలనచిత్ర అనుభూతిని ఈ సినిమా ఇస్తుందని బన్నీ వాస్ తెలిపారు.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.